# లోతొర్రే లో ఆదివాసీ వెదురు గుర్రాల ఆచారం

## ప్రకృతి ఆరాధనకు ప్రతీక



జన్నారం,ఆగస్ట్ 14 (వుదయం విలేఖరి) జన్నారం మండలం లోతొర్రే గ్రామంలో ఆదివాసీల తరతరాలుగా కొనసాగుతున్న ప్రత్యేక ఆచారం ఆషాఢ అమావాస్య రోజున ఘనంగా నిర్వహిస్తారు.ఆ రోజు అడవి నుంచి వెదురు బొంగులను తీసుకువచ్చి గుర్రాల ఆకారాలను తయారు చేస్తారు. శుక్రవారం రోజున గ్రామస్తులు వాటికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొడ శంకర్ మాట్లాడుతూ సుమారు నెల రోజుల పాటు ఆ వెదురు గుర్రాలపై నడిచే సంప్రదాయం కొనసాగుతుందని,పొలాల అమావాస్య రోజున తిరిగి అడవికి వెళ్లి ఆ వెదురు గుర్రాలను అక్కడే విడిచిపెట్టి, ప్రకృతికి మొక్కు సమర్పిస్తారని తెలిపారు.ఉపవాస దీక్షను పాటించడం కూడా ఈ ఆచారంలో భాగం.పూర్వకాలంలో అంటువ్యాధులు, అనారోగ్యాల నుంచి గ్రామ ప్రజలను కాపాడుకోవాలనే విశ్వాసంతో ఈ ఆచారాన్ని పాటించేవారని పెద్దలు చెబుతారని,ముఖ్యంగా పిల్లలు, పెద్దలు వెదురు గుర్రాలపై నడవడం ద్వారా వ్యాధులు దూరంగా ఉంటాయని నమ్ముతారని,ఇది కేవలం ఆచారం మాత్రమే కాదు ఆదివాసీల ప్రకృతి ఆరాధన, అడవితో ఉన్న అనుబంధం, పూర్వీకుల విశ్వాసాలు,తరతరాలుగా కొనసాగుతున్న సంస్కృతి--సంప్రదాయాలకు ప్రతీక గా నిలుస్తుందని వివరించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మండాడి నాణేశ్వర్, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

# ఖర్గే ప్రసంగించిన వేదికకు 'శుద్ధి'.. దళితులను అవమానించడమే.

## - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.



వేములవాడ, ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి ): కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు, దళిత నాయకుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన సభా వేదికను శుద్ధీకరణ పేరుతో హవనం చేయడం కుల వివక్షకు పరాకాష్టగా, దళిత సమాజాన్ని అవమానించే చర్యగా రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మండిపడ్డారు, ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ రాంలీలా మైదానంలో చోటుచేసుకున్న ఘటనను తీవ్రంగా ఖండిస్తూ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు, హల్ద్వానీలో ఇటీవల కాంగ్రెస్ నిర్వహించిన 'విజయ్ శంఖనాద్' సభలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన రెండు రోజుల తర్వాత అదే వేదిక వద్ద శ్రీరామ్ సేన కార్యకర్తలు శుద్ధీకరణ హవనం నిర్వహించడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు, దళిత సమాజానికి చెందిన జాతీయ నాయకుడు ప్రసంగించిన వేదికను శుద్ధి చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు, దేశ రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, గౌరవాన్ని కల్పించిందని, కులం పేరుతో వ్యక్తులను కించపరచడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆది శ్రీనివాస్ అన్నారు.రాజకీయ భేదాభిప్రాయాలు సహజమేనని, కానీ కులం, మతం పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టడం ప్రజాస్వామ్యానికి, దేశ సమైక్యతకు ప్రమాదకరమని వ్యాఖ్యానించారు,రాంలీలా మైదానం ఏ ఒక్క పార్టీకి చెందినది కాదని, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు తమ కార్యక్రమాలు నిర్వహించుకునే ప్రజా వేదిక అని గుర్తు చేశారు,అలాంటి వేదికపై ఒక నాయకుడు ప్రసంగించినందుకు శుద్ధీకరణ కార్యక్రమం చేపట్టడం ద్వారా సమాజానికి ఎలాంటి సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు,కాంగ్రెస్ పార్టీ మానవత్వం, సమానత్వం, సామాజిక న్యాయం, సోదరభావం వంటి రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉందని తెలిపారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సమానత్వ సమాజ నిర్మాణమే కాంగ్రెస్ లక్ష్యమని పేర్కొన్నారు. కులం, మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చిన ఆయన, ఈ ఘటనకు బాధ్యులపై ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# నిరాధార ఫిర్యాదులు, తప్పుడు ప్రచారాన్ని ఉపేక్షించం.

**....జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**అధికారులను అప్రతిష్ఠపాలు చేయాలనే ఉద్దేశంతో ఫిర్యాదు చేసిన బొబ్బిలి సత్యనారాయణకు లోకాయుక్త రూ.10 వేల జరిమానా**

**తప్పుడు సమాచారం వ్యాప్తి చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవు**



పెద్దపల్లి, ఆగస్టు-14 (వుదయం ప్రతినిధి) అధికారులపై నిరాధార ఆరోపణలు చేస్తూ తప్పుడు ప్రచారం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు.

సామాజిక కార్యకర్తగా చెప్పుకునే పెద్దపల్లి మండలం రాఘవపూర్ కు చెందిన బొబ్బిలి సత్యనారాయణ అధికారులను అనవసరంగా అప్రతిష్ఠపాలు చేసే విధంగా లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పెద్దపల్లి రాఘవాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఏల్లమ్మ ఆలయ నిర్మాణానికి సరైన అనుమతులు లేవంటూ బొబ్బిలి సత్యనారాయణ 02.01.2023న లోకాయుక్త కు ఫిర్యాదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

ఈ ఫిర్యాదుపై సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ జరిపి, అవసరమైన వివరాలతో కూడిన నివేదికను లోకాయుక్తకు సమర్పించినట్లు పేర్కొన్నారు.అధికారులు సమర్పించిన నివేదికను పరిశీలించిన అనంతరం, బొబ్బిలి సత్యనారాయణ దాఖలు చేసిన ఫిర్యాదు నిరాధారమైనది, వేధింపులకు ఉద్దేశించినదిగా లోకాయుక్త పేర్కొంటూ 22.12.2025న ఫిర్యాదును కొట్టివేసిందని కలెక్టర్ తెలిపారు.

తప్పుడు, నిరాధార ఫిర్యాదు ద్వారా లోకాయుక్త సంస్థ సమయంతో పాటు ప్రభుత్వ అధికారుల విలువైన సమయాన్ని కూడా వృథా చేసినందుకు తెలంగాణ లోకాయుక్త చట్టంలోని సెక్షన్ 13-ూ కింద రూ.10,000 జరిమానా విధించినట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.లోకాయుక్త ఆదేశాల మేరకు రూ.10,000 జరిమానాను రెవెన్యూ రికవరీ చట్టం కింద బొబ్బిలి సత్యనారాయణ నుంచి వసూలు చేసి ముఖ్యమంత్రి సహాయనిధిలో జమ చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు.ప్రజా సమస్యలపై వాస్తవాధారాలతో ఫిర్యాదులు చేయడాన్ని ప్రభుత్వం స్వాగతిస్తుందని, అయితే వ్యక్తిగత ప్రయోజనాల కోసం లేదా ప్రభుత్వ అధికారులను అప్రతిష్ఠపాలు చేయాలనే ఉద్దేశంతో నిరాధార ఆరోపణలు చేయడం, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం సరికాదని జిల్లా కలెక్టర్ అన్నారు.అధికారులపై తప్పుడు వార్తలు, నిరాధార ఆరోపణలు వ్యాప్తి చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ఎవరినీ ఉపేక్షించబోమని, అలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

# గాయత్రి జూనియర్ కళాశాల స్వాగతోత్సవ వేడుకలు






పెద్దపల్లి ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి) పెద్దపల్లిలోని గాయత్రి జూనియర్ కళాశాల విద్యార్థుల స్వాగతోత్సవ వేడుకలు రంగంపల్లిలోని గోల్డెన్ తులిప్ ఫంక్షన్ హాల్ లో అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. నూతన విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలుకుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని అదే దిశగా నిరంతరం కృషి చేయాలని, ప్రతి మార్కు ఎంతో విలువైనదని, ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ప్రేరేపించారు.గాయత్రి విద్యానికేతన్ కరస్పాండెంట్ రజనీ దేవి విద్యార్థులను ఉత్సాహపరుస్తూ, తాము నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకునే వరకు అలసట లేకుండా పట్టుదలతో ప్రయాణం కొనసాగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గాయత్రి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ , అధ్యాపక బృందం పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ముఖ్యంగా నృత్య ప్రదర్శనలు, వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరినీ అలరించాయి.

# ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

## : ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య



నాగిరెడ్డిపేట,వుదయం : మండలంలోని టీసీ గడ్డ తండా ఎంపీపీఎస్ పాఠశాలలో ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య హాజరై విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని సూచించారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు.అనంతరం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్త అంజమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

# లోతొర్రే ఎంపీపీస్ విద్యార్థులకు ఉచిత బూట్లు,యూనిఫామ్ పంపిణీ




జన్నారం,ఆగస్ట్ 14 (వుదయం విలేఖరి) జన్నారం మండలంలోని లోతొర్రే గ్రామ ఎంపీపీస్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన నల్ల బూట్లు, సాక్సులు, టై, బెల్ట్ మరియు యూనిఫామ్‌లతో కూడిన బ్రాండెడ్ కిట్లను పంపిణీ చేశారు.ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా అన్ని సౌకర్యాలతో విద్యనభ్యసించాలనే లక్ష్యంతో ఈ కిట్లను అందించినట్లు సర్పంచ్ బోడ శంకర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం.ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, సమాన అవకాశాలు కల్పించడమే మా సంకల్పం అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మండాడి ననేశ్వర్, ఉపాధ్యాయులు స్పందన, కుమారస్వామి, అంగన్వాడీ టీచర్ బోడ కవిత, పంచాయతీ కార్యదర్శి రాయిసిడం జక్కు గ్రామ పెద్ద కుర్సెంగా గంగారాం పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# 17న ఐటీఐలో ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా



జన్నారం,ఆగస్ట్ 14 (వుదయం విలేఖరి) జిల్లా ప్రభుత్వ ఐటీఐ మరియు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ జన్నారంలో ఆగస్ట్ 17, 2026 న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నారని,ప్రముఖ ఎంఎన్‌సీ కంపెనీల్లో అప్రెంటిస్ ఉద్యోగ అవకాశాలు పొందేందుకు ఇది అరుదైన అవకాశమని ప్రిన్సిపాల్ వై.రమేష్ శుక్రవారం రోజున ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మేళాలో ప్రధాన కంపెనీలు రానే మద్రాస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎల్ ఆ టీ కన్‌స్ట్రక్షన్స్, శక్తి హార్మోన్స్, ఆదర్శ ఆటోమొబైల్స్ తదితర కంపెనీలు పాల్గొంటున్నాయని వివరించారు.కావున జిల్లా ప్రభుత్వ ఐటీఐ మరియు ఏటీసీ లలో ఉత్తీర్ణులైన విద్యార్థులందరూ తప్పనిసరిగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## గోలిలింగాల పాఠశాలకు ఉపాధ్యాయుడిని తిరిగి పంపాలని వినతి




నాగిరెడ్డిపేట,వుదయం: నాగిరెడ్డిపేట మండలం గోలిలింగాల పాఠశాలలో పనిచేస్తున్న సోషల్ ఉపాధ్యాయుడి డిప్యూటేషన్‌ను రద్దు చేసి, తిరిగి అదే పాఠశాలకు పంపాలని గ్రామస్థులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంఈవో వెంకట్రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుడిని ఇతర పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపడంతో గోలిలింగాల పాఠశాలలో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆటంకం కలగకుండా అధికారులు వెంటనే స్పందించి డిప్యూటేషన్‌ను రద్దు చేసి ఉపాధ్యాయుడిని తిరిగి పాఠశాలకు కేటాయించాలని గ్రామస్థులు కోరారు.

# మురిమడుగు డ్రైవర్ రాజు కు ఆర్థిక సాయం



జన్నారం,ఆగస్ట్ 14 (వుదయం విలేఖరి)జన్నారం మండలం మురిమడుగు గ్రామం సత్యసాయి కాలనీ నివాసి మంతిని రాజు అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పంట పొలాల్లో ట్రాక్టర్ డ్రైవర్ గా పని చేస్తూ డ్రైవర్ రాజు గా చిన్న పెద్ద అందరికీ సుపరిచితుడు.చాలా చురుకుగా పనిచేసే రాజు రెండేళ్ల క్రితం లివర్ వ్యాధికి గురయ్యారు.చికిత్స కోసం ఉన్న ట్రాక్టర్ ను అమ్మేశారు.రెక్కాడితే డొక్కాడని పరిస్థితి కావడంతో తిరిగి అద్దెకు డ్రైవింగ్ ప్రారంభించారు.ట్రాక్టర్ ఫీల్డ్ లో పని కారణంగా వ్యాధి పూర్తిగా తగ్గక మళ్లీ తీవ్రమైంది. హైదరాబాద్ గవర్నమెంట్ హాస్పిటల్ కు వెళ్లేందుకు ప్రయాణ ఖర్చులకు కూడా డబ్బులు లేని పరిస్థితి ఏర్పడింది.ఇది తెలుసుకున్న సత్యసాయి కాలనీ యూత్ మరియు కాలనీ వాసులు కలిసి 11,500 రూపాయలు ఆర్థిక సాయంగా అందజేశారు.దాతలు ముందుకు వచ్చి తమకు తోచినంత సాయం చేయాలని కాలనీ వాసులు కోరారు.

# 19వ తేదీ నుంచి ఉచిత శిక్షణ ప్రారంభం



కామారెడ్డి, ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి):నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో గల కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కామారెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ నుండి పురుష అభ్యర్థులకు ఉచిత సీసీ టీవీ కెమెరా రిపేర్ ఫిట్టింగ్ శిక్షణ ప్రారంభం అవుతుందని సంస్థ డైరెక్టర్ అమర్ సింగ్ శుక్రవారం తెలిపారు.

దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు బుధవారం రోజున ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయాలన్నారు. దరఖాస్తు చేయని అభ్యర్థులు పరిమిత సీట్లకు వెంటనే కార్యాలయాన్ని సందర్శించి దరఖాస్తు పెట్టుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 92475 40478 నెంబరును సంప్రదించాలన్నారు.

# టైలరింగ్ నైపుణ్యానికి సీఎస్సీ సర్టిఫికెట్...




జగిత్యాల ఆగస్టు 13 (వుదయం ప్రతినిధి) కుట్టు మిషన్ (టైలరింగ్) పనిలో అనుభవం ఉండి ఎలాంటి అధికారిక సర్టిఫికెట్ లేని మహిళలకు కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్సీ) ద్వారా కేంద్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన సర్టిఫికెట్ అందించే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు జిల్లా సీఎస్సీ సమన్వయకర్త జలంధర్ తెలిపారు సీఎస్సీ ఆధ్వర్యంలో టైలరింగ్ కోర్సుకు నమోదు చేసుకున్న మహిళలకు ఒకే రోజులో సర్టిఫికెట్ జారీ చేయనున్నట్లు ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు టైలరింగ్ లో నైపుణ్యం కలిగిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభకు అధికారిక గుర్తింపు పొందవచ్చన్నారు ఈ సర్టిఫికెట్ ప్రైవేటు ఉపాధి అవకాశాలు పొందడంతో పాటు స్వయం ఉపాధి కార్యక్రమాలు చేపట్టేందుకు బ్యాంకు రుణాలు పొందేందుకు ఉపయోగపడుతుందని వివరించారు జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్న మహిళలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరిన ఆయన టైలరింగ్ సర్టిఫికెట్ కోసం సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్‌లను సంప్రదించాలని సూచించారు

# స్వర్ణపాసన సర్వరోగ నివారణ...

## స్వర్ణ ప్రాసనతో పిల్లల్లో పెరుగుతున్న ఇమ్యునిటీ పవర్... స్వర్ణపాసన రోజుకు పెరుగుతున్న ఆదరణ...

## డాక్టర్ గంప నరేష్ లక్ష్మి



కోరుట్ల ఆగస్టు 12 (వుదయం ప్రతినిధి) కోరుట్ల పట్టణ దేవా ఆయుర్వేదిక్ హెల్త్ కేర్ సెంటర్లో పుష్యమి నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వర్ణపాసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ గంప నరేష్ లక్ష్మి లు తెలిపారు స్వర్ణప్రాసన ద్వారా పిల్లలు ఇమ్యూనిటీ పవర్ పెరగడుతుందని ఆయుర్వేద నిపుణులు డాక్టర్ ప్రభాకర్ రెడ్డి గోల్డ్ మెడలిస్ట్ ప్రత్యేక తయారీ ద్వారా ఆరోగ్యకరమైన రోగ నిరోధక శక్తిని శారీరక ఎదుగుదల కోసం బిడ్డల సంపూర్ణ ఆరోగ్య కోసం తయారుచేసిన స్వచ్ఛమైన ఆయుర్వేద స్వర్ణ పోషణ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని దీని ద్వారా మేధాశక్తి జ్ఞాపకశక్తి పెరిగేందుకు దోహదపడుతుందని రోగ నిరోధక శక్తి వ్యాధులను ఎదుర్కొనే పెంచేందుకు సహాయ పడుతుందని శారీరక బలం ఎదుగుదలకు తోడ్పడుతుందని ఆకలి జీర్ణ క్రియ మెరుగుపడేందుకు సహాయపడుతుంది దగ్గు జలుబు జ్వరం వైరల్ ఇన్ఫెక్షన్లలో ఉపయోగకరంగా ఉంటుంది చర్మ అలర్జీ తరచుగా వచ్చే ఇన్ఫెక్షన్ లో సహాయపడుతుంది శరీరాన్ని శుద్ధి చేయడంలో రక్త శుద్ధికి సహాయపడుతుంది శ్వాస కోసం వ్యవస్థను లోపేతం చేయుడంలో సహాయపడుతుంది దగ్గు జలుబు ఆస్తమా అలర్జీలు చర్మ వ్యాధులు బలహీనమైన రోగనిరోధక శక్తి అజీర్ణం మలబద్ధకం చెవి ఇన్ఫెక్షన్ టాన్సిలైటీస్ తరచుగా వచ్చే జ్వరం బలహీనత ఆకలి లేకపోవడం పేగుల్లో పురుగులు సాధారణ బలహీనత శక్తి లేకపోవడం ఇతర ఆరోగ్య సమస్యలకు స్వర్ణభాషణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు ఇప్పుడు ఇట్టి స్వర్ణ ప్రాసన కార్యక్రమాన్ని కోరుట్ల జగిత్యాల కరీంనగర్లలో కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు కావున కోరుట్ల జగిత్యాల కరీంనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు ఇట్టి సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు

# నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన... జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్



జగిత్యాల ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి) జగిత్యాల రూరల్ మండలం వంజరు పల్లి గ్రామంలో 20 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా పాలన లో అర్హులందరికీ
చేయూత పెన్షన్ లు జగిత్యాలకు పెన్షన్ ల రూపంలో 47 కోట్ల రూపాయలలో
కేంద్రం వాటా 40 లక్షలు అని కేంద్ర పిఎం కిసాన్ నిధుల్లో అనేక నిబంధనలు యూరియా డిఏపి పెట్రోల్ డీజిల్ ధరలు పెంచారు రైతు పెట్టుబడి ఖర్చు పెంచి పెట్టుబడి సాయానికి మాత్రం అనేక నిబంధనలు అర్హులు అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానని అభివృద్ధి లో రాజకీయాలకు చోటు లేదు కక్ష సాధింపు నా విధానం కాదు ప్రభుత్వంతో కలిసి పని చేసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు వంజరు పల్లి గ్రామంలో రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రం కోసం స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య సర్పంచ్ అదరవేణి గంగమల్లయ్య
ఉపసర్పంచ్ బొల్లె తిరుపతి భీమవ్వ మార్కెట్ కమిటీ చైర్మెన్ గడ్డం నారాయణరెడ్డి ఎంపీడీవో రమాదేవి తహసీల్దార్ హకీం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాల ముకుందం మాజీ పాక్స్ చైర్మెన్ సదాశివ రావు మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ నక్కల రవీందర్ రెడ్డి సర్పంచుల ఫోరం కట్ట రాజేందర్ మాజీ ఎంపీపీ మహేష్ సర్పంచ్ లు ప్రకాశ్ వంశీ మాజీ సర్పంచ్ మల్లారెడ్డి కుడుకుల లక్ష్మణ్ అంకం సతీష్ నరేష్ గంగారం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు డీలర్ రవి నరేష్ మండల యూత్ అధ్యక్షులు భూమరెడ్డి నాయకులు తిరుపతి ఎఎంసి డైరెక్టర్ శ్రీకాంత్ మాజీ ఎంపీటీసీ శంకర్ అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# పేదల సొంతింటి కల సాకారం

**అయిజ, ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి):**

ఇందిరమ్మ గృహ పథకంతో పేదల సొంతింటి కల సాకారం అవుతోందని ఈడిగోనిపల్లి సర్పంచ్ మంజుల బడేసాబ్ యాదవ్ అన్నారు. గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో తహశీల్దార్ జ్యోతితో కలిసి ఆమె పాల్గొన్నారు.
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ కృషితో పేదలు సొంత ఇళ్లను నిర్మించుకుంటున్నారని సర్పంచ్ పేర్కొన్నారు. నిరుపేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు రాజీవ్ స్వామి, భీందాస్, జనార్ధన్, కాంగ్రెస్ నాయకులు మధుసూదన్ రెడ్డి, షేక్ షావలి, సంకపురం రాముడు, తాయప్ప, డీలర్ ఈరన్న తదితరులు పాల్గొన్నారు.



# పటాన్చెరులో గూడెం విష్ణువర్ధన్ రెడ్డి జయంతి వేడుకలు

**250 మందికి పైగా యువకుల రక్తదానం.. ఉచిత వైద్య శిబిరం, అన్నదానం, రోగులకు పండ్ల పంపిణీ**
**భారీ సంఖ్యలో పాల్గొన్న జిఎంఆర్, జివిఆర్ యువసేన సభ్యులు**
**గూడెం విష్ణువర్ధన్ రెడ్డి సేవలను స్మరించుకున్న నాయకులు**

**పటాన్చెరు (వుదయం):**

పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పెద్ద కుమారుడు కీర్తిశేషులు గూడెం విష్ణువర్ధన్ రెడ్డి 37వ జయంతి వేడుకలను జిఎంఆర్, జివిఆర్ అభిమానులు, స్నేహితులు ఘనంగా నిర్వహించారు. సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ విష్ణువర్ధన్ రెడ్డి జ్ఞాపకాలను స్మరించుకున్నారు.
జయంతి సందర్భంగా పటాన్చెరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జిఎంఆర్ యువసేన, జివిఆర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 250 మందికి పైగా యువకులు రక్తదానం చేసి తమ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. రక్తదాన శిబిరాన్ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆర్ఎంఓ శ్రీనివాస్ పర్యవేక్షించారు.అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నిరుపేద ప్రజలకు అన్నదానం నిర్వహించారు. బ్లాక్ ఆఫీస్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందించారు.
అనంతరం అభిమానులు, సన్నిహితులు, యువసేన సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేసి గూడెం విష్ణువర్ధన్ రెడ్డి జయంతి వేడుకలను నిర్వహించారు.
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన



సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. గూడెం విష్ణువర్ధన్ రెడ్డి తండ్రికి తగ్గ తనయుడిగా ఎదుగుతున్న క్రమంలో అకాల మరణం చెందడం అత్యంత బాధాకరమని అన్నారు. ప్రజా సేవ పట్ల ఆయనకున్న ఆసక్తి, స్నేహశీలత, సేవా భావం అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. విష్ణువర్ధన్ రెడ్డి ఆశయాలు, ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆయన జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, యాదగిరి యాదవ్, విజయ్ కుమార్, నర్రా బిక్షపతి, రామచంద్రారెడ్డి, పృథ్వీరాజ్, గూడెం సంతోష్ రెడ్డి, గూడెం సందీప్ రెడ్డి, అశోక్, వెంకటేష్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# బాంబు స్క్వాడ్ పోలీస్ జాగిలాలతో విస్తృత తనిఖీలు

**నారాయణపేట టౌన్ ఆగస్టు14 (వుదయం ప్రతినిధి)**

15వ ఆగస్టు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నారాయణపేట జిల్లాలో ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బాంబ్ స్క్వాడ్ పోలీసు బృందం, పోలీస్ జాగిలాలతో విస్తృత తనిఖీలు నిర్వహించారు.
జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్, జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణ, కోర్టు ప్రాంగణం, ప్రధాన చౌరస్తాలు, జనసామర్థ్యం అధికంగా ఉండే ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్ బృందం తనిఖీలు చేపట్టింది. అనుమానాస్పద వస్తువులు, బ్యాగులు, సంచులు, వాహనాలపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశారు.
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా పోలీసు బందోబస్తు, నిఘా చర్యలను ముమ్మరం చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా అనుమానాస్పద వస్తువులు, బ్యాగులు, సంచులు లేదా వాహనాలు కనిపించినా వెంటనే సమీప పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత కోసం పోలీసులకు సహకరించాలని కోరారు.

# అక్రమ వేటకు చెక్.. అటవీ నేరాలపై ఉక్కుపాదం

**అమ్రాబాద్ అటవీ డివిజన్ నూతన FDOగా యశ్ చంద్రప్రకాశ్**

**నాగర్ కర్నూల్, ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి):**



అమ్రాబాద్ అటవీ డివిజన్ నూతన ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ (FDO)గా యశ్ చంద్రప్రకాశ్ సింఘాల్, IFS బాధ్యతలు స్వీకరించారు. 2024 బ్యాచ్‌కు చెందిన ఆయన IGNFA డెహ్రాడూన్‌లో రెండేళ్ల శిక్షణ పూర్తి చేసి, మహదేవ్‌పూర్ పెగడపల్లి రేంజ్‌లో OJT శిక్షణ అనంతరం అమ్రాబాద్‌లో FDOగా బాధ్యతలు చేపట్టారు.
ఇంతకుముందు FDOగా పనిచేసిన రామ్మూర్తి బదిలీపై మంచిర్యాల జిల్లా చెన్నూరుకు వెళ్లారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం యశ్ చంద్రప్రకాశ్ మాట్లాడుతూ అటవీ, వన్యప్రాణుల సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో వన్యప్రాణుల రక్షణ, అటవీ సంపద పరిరక్షణ తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ముఖ్యంగా అక్రమ వేటను పూర్తిగా అరికట్టడంతో పాటు అటవీ నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు.అటవీ ప్రాంతాల్లో గస్తీని ముమ్మరం చేసి, అక్రమ కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్థానికుల సహకారంతో అడవులను పరిరక్షిస్తామని, పర్యావరణ సమతుల్యతకు కృషి చేస్తామని నూతన FDO తెలిపారు.

# సిగాచి బాధితులకు సంపూర్ణ న్యాయం చేయాలి

**ముఖ్యమంత్రికి టీపీజేఏసీ బహిరంగ లేఖ**

**సంగారెడ్డివుదయం :**

సిగాచి ఇండస్ట్రీస్ ఘోర ప్రమాదం జరిగి 13 నెలలు గడిచినా బాధిత కుటుంబాలకు సంపూర్ణ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీజేఏసీ) సంగారెడ్డి జిల్లా కమిటీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ విడుదల చేసింది. సంగారెడ్డి జిల్లా శాంతినగర్‌లోని టీపీటీఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లేఖను విడుదల చేశారు.ముఖ్యమంత్రి సంగారెడ్డి జిల్లాకు వస్తున్న నేపథ్యంలో సిగాచి బాధిత కుటుంబాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లేందుకే బహిరంగ లేఖ విడుదల చేసినట్లు టీపీజేఏసీ తెలిపింది.రూ.58 లక్షల పరిహారం పెండింగ్: ప్రమాదంలో బాధితులైన 54 కుటుంబాలకు సీఎం ప్రకటించిన రూ.1 కోటి పరిహారంలో ఇప్పటివరకు రూ.42 లక్షలు మాత్రమే అందాయని, మరో రూ.58 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయని కమిటీ తెలిపింది. మిగిలిన మొత్తాన్ని వెంటనే విడుదల చేసి పూర్తి పరిహారం అందించాలని కోరింది.
ఎక్స్‌గ్రేషియా, కార్మిక ప్రయోజనాలు ఇవ్వాలి: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా 11 మంది బాధితులకు, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.1 లక్ష ఎక్స్‌గ్రేషియా 8 మంది బాధితులకు ఇంకా అందలేదని పేర్కొంది. అలాగే పెండింగ్‌లో ఉన్న EPF, EDLI, ESIC/ESI ప్రయోజనాలను వెంటనే అందించాలని డిమాండ్ చేసింది.తొలగించిన కార్మికులకు న్యాయం చేయాలి: ప్రమాదం అనంతరం పలువురు కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించారని, వారికి చట్టబద్ధంగా అందాల్సిన వేతన బకాయిలు, EPF, ESI తదితర ప్రయోజనాలు పూర్తిగా అందలేదని టీపీజేఏసీ ఆరోపించింది. కార్మిక శాఖ ద్వారా సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని కోరింది.
తీవ్రంగా గాయపడిన ముగ్గురికి రూ.50 లక్షలు ఇవ్వాలి: ప్రమాదంలో తీవ్రంగా



గాయపడిన రాజేష్ కుమార్ చౌదరి, సుష్మ, దివ్యలకు ప్రస్తుతం అందించిన రూ.10 లక్షల పరిహారాన్ని రూ.50 లక్షలకు పెంచాలని టీపీజేఏసీ డిమాండ్ చేసింది. వారి భవిష్యత్ వైద్య ఖర్చులు, ఉపాధి నష్టం, శారీరక-మానసిక వేదనను పరిగణనలోకి తీసుకోవాలని కోరింది. సుష్మ, దివ్యలకు వారి విద్యార్హతలకు అనుగుణంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని ఫార్మాస్యూటికల్ కంపెనీల్లో శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని విజ్ఞప్తి చేసింది.
సీఎం స్థాయిలో ప్రత్యేక సమీక్ష చేయాలి: సిగాచి బాధితుల సమస్యను సంగారెడ్డి జిల్లా ప్రత్యేక సమస్యగా పరిగణించి, ముఖ్యమంత్రి స్థాయిలో ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని టీపీజేఏసీ కోరింది. పెండింగ్‌లో ఉన్న అన్ని పరిహారాలు, ప్రభుత్వ సహాయాలు, చట్టబద్ధ ప్రయోజనాలను నిర్ణీత గడువులోగా అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.ఈ కార్యక్రమంలో టీపీజేఏసీ సంగారెడ్డి జిల్లా కన్వీనర్ వై. అశోక్ కుమార్, కోఆర్డినేటర్ శ్రీధర్ మహేంద్ర, కోకన్వీనర్లు యం. చంద్రారెడ్డి, ఎస్. రామకృష్ణ, కే. చంద్రమోహన్ చారి, టి. రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# చౌటపల్లి విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ



**ఐకేపీ ఆధ్వర్యంలో రెండు జతల యూనిఫామ్‌లు**

**అచ్చంపేట, ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి):**

మండలంలోని చౌటపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం, ఐకేపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో రెండు జతల స్కూల్ యూనిఫామ్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. ఐకేపీ సీసీలు వెంకట్, తిరుపతయ్య మాట్లాడుతూ విద్యార్థుల కొలతలకు అనుగుణంగా కుట్టించిన యూనిఫామ్‌లను పంపిణీ చేసినట్లు తెలిపారు. మహిళా సంఘాల ద్వారా స్థానికంగానే దుస్తులను తయారు చేయించి అందిస్తున్నట్లు వారు వివరించారు.ఐకేపీ సీసీ తిరుపతయ్య పాఠశాల ప్రధానోపాధ్యాయులకు యూనిఫామ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా విద్యార్థులకు అవసరమైన విధంగా దుస్తులు తయారు చేయించి అందించడం అభినందనీయమని కొనియాడారు.
ప్రభుత్వం అందిస్తున్న ఈ యూనిఫామ్‌లతో పేద విద్యార్థులకు ఆర్థిక భారం తగ్గడంతో పాటు పాఠశాలలకు క్రమశిక్షణతో రావడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 23 చలో హైదరాబాద్ గోడపత్రిక విడుదల



**ఉర్కొండ న్యూస్ 14 వుదయం ప్రతినిధి**

స్థానిక ఉరుకొండ మండలంలోని వివిధ డిపార్ట్మెంట్లో మండల రెవెన్యూ ఆఫీసర్ ఎంపీడీవో అగ్రికల్చర్ మరియు మండల పరిషత్ హై స్కూల్ ఉరుకొండలో ఈరోజు నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఒక లక్ష మందితో చేయబోతున్నటువంటి ఆగస్టు 23 చలో హైదరాబాద్ కార్యక్రమం యొక్క గోడపత్రికను విడుదల చేయడం జరిగింది.
కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ నరసింహారావు మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని ఇస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చింది కావున ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని తెలిపారు. ఆగస్టు 23న తలపెట్టిన ఈ కార్యక్రమానికి సిపిఎస్ మరియు ఓపీఎస్ ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో హాజరుకావాలని మన యొక్క బాధను ప్రభుత్వంతో తెలపాలని కోరారు.కార్యక్రమంలో టిఎస్ సిపిఎస్ఈ యు మండల బాధ్యులు రవి కుమార్ నాగరాజు రవీందర్ జగదీష్ శ్రీశైలం ఇబ్రహీం ఆనంద్ కుమార్ సరళ స్వస్తిత తదితరులు పాల్గొన్నారు

# అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల మెరుపు దాడి

**బోలెరో వాహనం సీజ్.. డ్రైవర్‌పై కేసు నమోదు**

**కోహెడ ఆగస్టు 14 : (వుదయం ప్రతినిధి )**

కోహెడ మండలంలో అక్రమ ఇసుక రవాణాపై కోహెడ పోలీసులు కొరడా ఝుళిపించారు. నమ్మదగిన సమాచారం మేరకు శనిగరం గ్రామంలోని ధాబా సమీపంలో పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి, అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ బోలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2026 ఆగస్టు 10న శనిగరం గ్రామం నుంచి సిద్దిపేటకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఇసుకను తరలిస్తున్న *బోలెరో వాహనం (TG08T9776)*ను గుర్తించి సీజ్ చేశారు.వాహనంలో ఇసుక తరలిస్తున్న కుంచెం సతీష్, తండ్రి కనకయ్య, వయస్సు 27 సంవత్సరాలు, వృత్తి డ్రైవర్, సిద్దిపేటకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ఇసుక





రవాణాకు సంబంధించి ఎలాంటి అధికారిక అనుమతులు లేకపోవడంతో వాహనాన్ని కోహెడ పోలీస్ స్టేషన్‌కు తరలించి, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.
ఈ సందర్భంగా కోహెడ ఎస్ఐ పి. అభిలాష్ మాట్లాడుతూ.. అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించి ఇసుక తరలిస్తే కేసులతో పాటు జైలు శిక్ష కూడా తప్పదని స్పష్టం చేశారు. అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల నిఘా కొనసాగుతుందని తెలిపారు.

# లోకపల్లి లక్ష్మమ్మ ఆలయంలో శ్రావణ మాస పూజలు



**నారాయణపేట ఆగస్టు14 (వుదయం ప్రతినిధి)**

శ్రావణమాసం సందర్భంగా శ్రీ శ్రీ లోకపల్లి లక్ష్మమ్మ ఆలయంలో మొదటి శుక్రవారం పూజా కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుండి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. అందులో భాగంగా అమ్మవారి భక్తుడు బాలకృష్ణ టీచర్ రిటైర్డ్ వారు రూ. 51,000 సమర్పించారు.ఆలయ కమిటీ తరపున కమిటీ సభ్యులు గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ గౌడ్, మాజీ సర్పంచ్ బిల్లీ నరసింహులు, మాజీ ఎంపీటీసీ ఎల్ అశోక్, జయలకంత, ఉపాధ్యక్షులు కన్న జగదీష్, రవికుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వేముల మధుసూదన్ రెడ్డి కమిటీ సభ్యులు శాలువాతో వారిని ఘనంగా సన్మానించారు.



# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎంపీపీ

**వుదయం న్యూస్ శివ్వంపేట ఆగస్ట్ 14....**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో ఇటీవల BRS పార్టీ కార్యకర్త గుణం గారి స్వామి తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ గుణంగారి రాజు సోదరుడు ప్రమాదవశత్తు నీట మునిగి మృతి చెందడం జరిగింది. ఇటి కుటుంబాన్ని నేడు మెదక్ జిల్లా మాజీ ఎంపీపీ ల పోరం అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సంఘం అందించారు. అనంతరం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఎల్లప్ప గారి బంగారయ్య లలిత దంపతుల కుమార్తె ఎల్లప్ప గారి రేవతి పదవ తరగతిలో మండల్ టాపర్గా నిలిచి బాసర ట్రిబుల్ ఐటీ లో సీటు సంపాదించిన శుభ సందర్భంగా వారి ఇంటికి వెళ్లి బాలిక రేవతిని ప్రశంసించి బాగా చదువుకోవాలని మా వంతు సహకారం తప్పకుండా అందిస్తామని నేడు కొత్త ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మాజీ సర్పంచులు. చిన్న వడ్డిముకల మాజీ సర్పంచ్.వార్డు సభ్యులు టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ట్రెండ్ హ్యుందాయ్ షోరూమ్ ప్రారంభం



**ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం**

**నాగర్ కర్నూల్ రూరల్, ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి):**

జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రెండ్ హ్యుందాయ్ షోరూమ్‌ను శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి ప్రారంభించారు.షోరూమ్‌ను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నూతన వ్యాపారాలు ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. ట్రెండ్ హ్యుందాయ్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆటోమొబైల్ రంగంలో నూతన షోరూమ్ రావడంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ జక్కా రాజు కౌన్సిలర్లు అనంత అలివేలమ్మ, హర్ష, మాధవి రాజు, సునీత హరీష్‌గౌడ్, శంకర్, గౌసియా బేగం ఇషాక్ తదితరులు పాల్గొన్నారు షోరూమ్ నిర్వాహకులు ఎమ్మెల్యేకు, అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన వాహనాల కొనుగోలుదారులకు అత్యుత్తమ సేవలు అందిస్తామని తెలిపారు.

# డంపింగ్ యార్డుకు బీడు భూములు లేవా? పంట పొలాలే కావాలా?

**భూసేకరణను అడ్డుకుంటాం**
**బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగం శశిధర్ రెడ్డి**

**నాగర్ కర్నూల్ రూరల్, ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి):**

డిండి ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా మంతటి గ్రామంలోని పంట పొలాలను ధ్వంసం చేసి భూసేకరణకు ప్రయత్నిస్తే అడ్డుకుంటామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ నాగం శశిధర్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన మంతటి గ్రామంలో పంట పొలాలను పరిశీలించారు.డంపింగ్ యార్డు ఏర్పాటుకు సుమారు 125 ఎకరాల భూమిని సేకరించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తమ భూములను ఇచ్చేది లేదని రైతులు స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా నాగం శశిధర్ రెడ్డి మాట్లాడుతూ డిండి ప్రాజెక్టుకు నీటిని తరలించేందుకు ఎస్ఎల్‌బీసీతో పాటు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నప్పటికీ రైతుల భూములనే ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. రైతులు రెండు పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, వారి పంట పొలాలను డంపింగ్ యార్డు కోసం సేకరించడం దారుణమన్నారు.
ప్రభుత్వం బీడు భూములను గుర్తించకుండా సారవంతమైన పంట పొలాలపైనే కన్నేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల భూములను కాపాడేందుకు అండగా నిలిచి పోరాటం చేస్తామని, భూసేకరణను అడ్డుకుని తీరుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అర్థం రవి, లక్ష్మయ్య, నాగయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ఇకపై ప్రతి సోమవారం ప్రజావాణి

**దౌల్తాబాద్ ఆగస్టు 14(వుదయం):**

ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించేందుకు మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల ప్రజా పరిషత్ అధికారి (ఎంపీడీఓ) అఫ్జలుద్దిన్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 17వ తేదీ నుంచి ప్రతి సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజావాణి కొనసాగుతుందని తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు, వినతులను ప్రజావాణిలో నేరుగా అధికారులకు అందజేయవచ్చన్నారు.



ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేసి, సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తామని చెప్పారు.ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకుంటారని ఎంపీడీఓ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పోలీస్ స్టేషన్లో వన మహోత్సవం

**ఎస్సై మధుకర్ రెడ్డి.....**
**వుదయం న్యూస్ శివ్వంపేట ఆగస్ట్ 14....**



మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఎస్సై మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వన మహోత్సవం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నేడు శివంపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ అధికారులు సిబ్బంది పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. హరిత సంకల్పం. స్టేషన్ ప్రాంగణాన్ని పచ్చదనంతో నింపేందుకు నీడనిచ్చే మరియు పండ్ల మొక్కలను సిబ్బంది నాటి నీరు పోశారు. అనంతరం ఎస్ఐ మధుకర్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కేవలం మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మరియు పరిసరాల పరిశుభ్రత పచ్చదనం పెంపొందించడంలో ప్రజలకు కూడా భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు హెడ్ కానిస్టేబుల్ కానిస్టేబుల్ మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అష్టలక్ష్మి ఆలయంలో విశేష పూజలు

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి**



శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని సిద్దిపేటలోని శ్రీ శ్రీ శ్రీ అష్టలక్ష్మి సహిత లలితా పరమేశ్వరి దేవాలయంలో తొలి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి విశేష అభిషేకం, ప్రత్యేక అలంకరణ, శ్రీచక్ర కుంకుమార్చన, ఒడిబియ్యం సమర్పణ తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, వేద మంత్రోచ్చారణల మధ్య అభిషేకం, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.శ్రావణ మాసంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించడం ద్వారా భక్తులకు శుభం, సుఖసంతోషాలు కలుగుతాయని ఆలయ ప్రధాన అర్చకులు కృపాకరాచార్యులు తెలిపారు. భక్తులు శ్రావణ మాసంలో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధించాలని సూచించారు.ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఆలయ నిర్వాహకులు జి. కిరణ్ కుమార్ వెల్లడించారు.



## ఆవుల రాజిరెడ్డి సేవలు అభినందనీయం

**చిన్న గొట్టిముక్కుల కాంగ్రెస్ నాయకులు.....**

**వుదయం న్యూస్ శివ్వంపేట ఆగస్ట్ 14....**



మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని చిన్న గొట్టుముక్కల గ్రామానికి చెందిన మాల పూజ ఇటీవల బైక్ ఆక్సిడెంట్ లో తన కాలు డామేజ్ కావడంతో ఒక కాలు మోకాలు కింద బాగాన సర్జరీ చేసి కాలును తీసివేయడం జరిగింది . ఈ విషయం శివ్వంపేట మాజీ సర్పంచి మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి తో ఈ విషయం చెప్పడంతో వెంటనే స్పందించిన నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి 1,25,000 ఎల్ఓసి మంజూరు చేయించడం జరిగింది. చిన్న గొట్టిముక్కుల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యక్షం. వీరస్వామి. షేక్ అలీమ్. పూర్తి బాధ్యత తీసుకొని కాలు ఇప్పియ్యడం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మాకు సహకరించిన ఆవుల రాజిరెడ్డికి.పులిమామిడి నవీన్ గుప్తకి. చిన్న గొట్టి ముక్కల కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు అని తెలిపారు.

## భారత రాజ్యాంగ పుస్తక నమూనా జాతీయ చిహ్నాలను ఏర్పాటు చేయాలి

**నారాయణపేట ఆగస్టు14 (వుదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న సమీకృత జిల్లా కార్యాలయాల సముదయ భవనంపై భారత రాజ్యాంగ పుస్తక నమూనా, జాతీయ చిహ్నాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ, ధర్మ సమాజ పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కేంద్రంలోని పురవీధుల గుండా ర్యాలీని నిర్వహించి కలెక్టర్ కి వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ

భారత రాజ్యాంగం ద్వారానే పరిపాలన వ్యవస్థ జరుగుతుందని ఈ భారత రాజ్యాంగం జిల్లా కలెక్టర్ ద్వారా అమలు చేయబడుతుంది కాబట్టి జిల్లా కార్యాలయం పై ఈ నిర్మాణాన్ని నిర్మించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

నారాయణపేట జిల్లా పౌరుల జననం నుండి మరణం వరకు (జనన మరణ ధ్రువపత్రాలు) భౌతిక జీవితం భారత రాజ్యాంగం తో ముడిపడి ఉందన్నారు. అదే విధంగా జిల్లా పౌరుల యొక్క అన్ని ప్రాథమిక హక్కులు విద్య వైద్యం ఉపాధి ఇల్లు భూమి రాజకీయాలలో వాటా సమాన మానవ గౌరవం సర్వ హక్కులు భారత రాజ్యాంగం ద్వారా పొందుతున్నాము అని వారు గుర్తు చేశారు. కాబట్టి భారత రాజ్యాంగ పుస్తక నమూనా నిర్మించాలని లేదంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ నాయకులు, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు అన్నారు.




**ఈ కార్యక్రమానికి జిల్లా బీఎస్పీ,** అంబేద్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పుస్తక నమూనా చిహ్నాలు ఏర్పాటు చేసే వరకు పోరాటం సాగుతుందని వివిధ సంఘాల పార్టీల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ వీరేష్, రాజు ,ఈశ్వర్, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు దేవిడ్ ,పార్ల కృష్ణ ,మల్లికార్జున్ ,గౌతమ్ ,అశోక్ ,ఆంజనేయులు ,నరేష్ ముదిరాజ్, బీఎస్పీ నాయకులు అశోక్ ,అంబేద్కర్ సంఘం అధ్యక్షులు పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## రియల్ బ్రోకర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలి

**కోర్టు ఉత్తర్వులు బేఖాతర్..**

**వుదయం న్యూస్ శివ్వంపేట ఆగస్ట్ 14....**

మెదక్ జిల్లా శివ్వంపేట రియల్ బ్రోకర్ల పై అధికారులు చర్యలు తీసుకొని మాకు న్యాయం చేసి మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తు బెదిరింపులకు పాల్పడుతున్నారని దొంతి గ్రామానికి చెందిన చుక్క రాణి, చుక్క శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు.శుక్రవారం శివ్వంపేటలో విలేకరులతో చుక్క శ్రీనివాస్ మాట్లాడుతూ దొంతి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 433లో 23గుంటల భూమిని హైదరాబాద్ సుల్తానా బజార్ కు చెందిన ఉమేష్ వీర్మాని దగ్గర గత 2013లో ఖరీదుకు తీసుకున్నామని వివరించారు. కొనుగోలు చేసిన భూమిలో 11 గుంటలు కబ్జాలో ఉండి ప్రస్తుతం ఉన్న ఇంటి నిర్మాణం చేసుకున్నామని చుక్క రాణి తెలిపారు. మిగతా 12 గుంటల భూమికి, సర్వే నిర్వహించి,చదును చేయించి, చుట్టూ పెన్సింగ్ వేసుకొని ఉన్నామన్నారు. గత 2013లో భూమిని ఖరీదుకు తీసుకొని రిజిస్ట్రేషన్ చేసుకునేటప్పుడు అమరేందర్ రెడ్డి సాక్షిగా కూడా ఉన్నాడని, ఇప్పుడు మేము కొనుగోలు చేసిన భూమిని అమరేందర్ రెడ్డి, సంజీవరెడ్డి మాదంటున్నారని చుక్క రాణి శ్రీనివాస్ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. మేము కొనుగోలు చేసిన భూమిలోకి ఇతర ప్రాంతాల నుండి దండోరా నాయకులను తెప్పించి వాళ్లతో భూతు మాటలు తిట్టించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మీకు ఇక్కడ భూమి లేదని ఇందులోకి వస్తే మాత్రం మిమ్మల్ని చంపుతామని సిక్కులతో మమ్మల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మాపై జరుగుతున్న అన్యాయాలు, దౌర్జన్యాల గురించి తూప్రాన్ డీఎస్పీ దృష్టికి, శివ్వంపేట ఎస్ఐ దృష్టికి తీసుకెళ్లిన గాని మాకు ఎలాంటి న్యాయం చేయలేదని, మాపైనే కేసులు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.భూమి విషయంలో కోర్టుకు వెళ్లి ఇంజక్షన్ ఆర్డర్ తెస్తే, కోర్టు ఉత్తర్వులను బేఖాతారు చేయకుండా ట్రాక్టర్ తో మాభూమిని దున్నేశారని ఆరోపించారు. కొనుగోలు చేసిన భూమిని కబ్జా చేయాలని చూస్తూ,ఇతర ప్రాంతాల నుండి మందిని తెచ్చి మమ్మల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్న అమరేందర్ రెడ్డి, సంజీవ రెడ్డి, సహకారం అందిస్తున్న రియల్ బ్రోకర్లపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని, మాకుటుంబానికి న్యాయం చేయాలనీ చుక్క శ్రీనివాస్ దంపతులు విజ్ఞప్తి చేశారు.



## పంటల రక్షణకు శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించాలి

**అధిక దిగుబడుల కోసం రైతులకు తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా. పి. అర్చన సూచనలు**

**గద్వాల ఆగస్టు 14 (వు దయం కరస్పాండెంట్)**

పంటల రక్షణకు శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డా. పి. అర్చన రైతులకు సూచించారు.శుక్రవారం తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఎర్రవల్లి, మానవపాడు మండలాల్లోని వేముల, కొండపల్లి, మానవపాడు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా పత్తి, వరి, మిర్చి, బెండ, టమాటా, కంది పంటలను పరిశీలించి పంటల పరిస్థితిని అంచనా వేశారు. ఆయా పంటలకు సంబంధించిన శాస్త్రీయ సూచనలను రైతులకు అందించారు. కొన్ని పత్తి పొలాల్లో మొక్కల పెరుగుదల మందగించినట్లు గుర్తించిన శాస్త్రవేత్తలు, వెంటనే పంటను తొలగించకుండా నేలలో తేమను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పూత, కాయ దశలో ఉన్న పత్తిలో పింక్ బోల్‌వార్మ్, రసం పీల్చే పురుగుల ఉధృతిని నిరంతరం పర్యవేక్షించాలని, ఎకరాకు ఐదు ఫెరోమోన్ ట్రాప్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మిర్చి పంటలో డ్రైనేజీ, గ్యాప్ ఫిల్లింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, త్రిప్స్ నియంత్రణకు ఎకరాకు 10 నుంచి 15 నీలం రంగు స్టిక్కీ ట్రాప్‌లు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. బెండ, టమాటా పంటల్లో తెల్లదోమ, జాసిడ్స్ తదితర పురుగుల ఉధృతిని గుర్తించేందుకు పసుపు స్టిక్కీ ట్రాప్‌లు వినియోగించాలని సూచించారు. వరి పంటలో 2-3 సెంటీమీటర్ల నీటిని మాత్రమే నిర్వహిస్తూ, సకాలంలో కలుపు నివారణ చేపట్టాలని తెలిపారు. సిఫారసు చేసిన మేరకే నత్రజని ఎరువులను వినియోగించాలని సూచించారు. కంది పంటలో అంతర దుక్కి, మట్టి కప్పడం వంటి చర్యలు చేపట్టి పొలంలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. రైతులు పంటలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ సమతుల్య పోషక యాజమాన్యం, సమీకృత పురుగు-వ్యాధి యాజమాన్య పద్ధతులను పాటించాలని డా. పి. అర్చన సూచించారు. అధికంగా నత్రజని ఎరువులు, విచక్షణారహితంగా పురుగుమందులు వినియోగించడం వల్ల పంటలకు నష్టం కలిగే అవకాశం ఉందని, అందువల్ల అవసరానికి అనుగుణంగా మాత్రమే వాటిని వినియోగించాలని సూచించారు. ఈ క్షేత్ర పర్యటనలో జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## 19వ మహాపాదయాత్రకు శ్రీకారం

## ధనాసిరి స్వామివారి చేతుల మీదుగా కరపత్రాల ఆవిష్కరణ

**కులమత భేదాలు లేకుండా భక్తులందరూ పాదయాత్రలో పాల్గొనాలి: శ్రీ శ్రీ ష బ్ర 108 వీరేశ్వర శివాచార్య హిరేమట్ ధనాసిరి స్వామి**

**పటాన్చెరు (వుదయం):**



వీరశైవ లింగాయత్ సేవాసమితి మరియు వీరశైవ లింగాయత్ మహాపాదయాత్ర కమిటీ – పటాన్చెరు నియోజక వర్గం ఆధ్వర్యంలో నిర్వహించబడనున్న 19వ మహాపాదయాత్రకు సంబంధించిన కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం శ్రావణమాసం పురస్కరించుకొని పటాన్చెరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ శ్రీ ష బ్ర 108 వీరేశ్వర శివాచార్య హిరేమట్ ధనాసిరి స్వామివారి పాదపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు.కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 30వ తేదీ ఉదయం 7 గంటలకు పటాన్చెరులోని శ్రీ ఉమామహేశ్వర దేవాలయం నుండి బొంతపల్లిలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవాలయం వరకు నిర్వహించబడనున్న 19వ మహాపాదయాత్ర కరపత్రాలను ధనసరి స్వామివారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం మహాస్వామివారు పాదయాత్ర నిర్వహణకు సంబంధించిన వివరాలను తెలుసుకుని నిర్వాహకులను అభినందించారు.ఈ సందర్భంగా ధనాసిరి స్వామివారు మాట్లాడుతూ, మహాపాదయాత్రలు కేవలం ఒక ఆధ్యాత్మిక కార్యక్రమం మాత్రమే కాకుండా సమాజంలో ఐక్యత, భక్తి, సేవాభావం పెంపొందించే మహత్తర యజ్ఞమని పేర్కొన్నారు. భగవంతుని స్మరణతో, శివనామ సంకీర్తనలతో, భక్తి భావంతో సాగించే పాదయాత్రలో పాల్గొనడం ద్వారా ఆధ్యాత్మిక ప్రశాంతతతో పాటు జీవితానికి స్ఫూర్తి లభిస్తుందని తెలిపారు.శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామివారి అనుగ్రహం పొందేందుకు నిర్వహిస్తున్న ఈ మహా పాదయాత్రలో కుల, మత, వర్గ, ప్రాంత భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. యువత ఎక్కువ సంఖ్యలో పాల్గొని సనాతన ధర్మ పరిరక్షణకు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు.

వీరశైవ లింగాయత్ సేవాసమితి ప్రతినిధులు మాట్లాడుతూ, గత సంవత్సరాల మాదిరిగానే ఈసారి కూడా మహాపాదయాత్రను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పాదయాత్రలో పాల్గొనే భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పటాన్చెరు మరియు పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాపాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పోచారం అశోక్, రాజయ్య స్వామి, ప్రశాంత్ కుమార్, ఓంకార స్వామి, విట్టల్, శంకర్ తదితరులతో పాటు వీరశైవ లింగాయత్ సేవాసమితి సభ్యులు, వీరశైవ లింగాయత్ మహాపాదయాత్ర కమిటీ సభ్యులు, సమాజ పెద్దలు మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కొండాపూర్ గురుకులని తనిఖీ చేసిన కలెక్టర్ ప్రియాంక



**మరికల్ ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి)**

ధన్వాడ కేంద్ర పరిధిలోని కొండాపూర్ గిరిజన గురుకులాలని నారాయణ పేట జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు తరగతి గదులని పరిశీలించి ఇంటర్ ద్వితీయ సమస్యల విద్యార్థులకు నీట్ జేఈఈ మెయిన్స్ పరీక్షలపై అవగాహన కల్పించారు అనంతరం భోజనశాలను తనకి చేసి వంటల పరిశీలించి మరియు విద్యార్థులకు టైముకు భోజనం అందించాలని మరియు నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆమె చేయించారు ఈ కార్యక్రమంలో తహసిల్దార్ స్ సింధుజ ప్రిన్సిపాల్ రాజారాం తో పాటు సిబ్బంది పాల్గొన్నారు

## పంద్రాగస్టు వేడుకలకు ముస్తాబైన పోలీస్ పరేడ్ గ్రౌండ్

**ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ**

**గద్వాల ఆగస్టు 14 (వుదయం బ్యూరో)**

జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముస్తాబైంది. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎ.పి. జితేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శనివారం ఉదయం 9:30 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. వేదిక, బారికేడింగ్, సీటింగ్ ఏర్పాట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.వేడుకలకు ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, ప్రజలు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో హాజరుకానున్నందున ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎగ్జిబిషన్ స్టాళ్లను ఆకర్షణీయంగా, సందర్శకులను ఆకట్టుకునే విధంగా ఏర్పాటు చేయాలని సూచించారు.అన్ని శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు కలెక్టరేట్‌లో నిర్వహించే పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొనడంతో పాటు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో



జరిగే ప్రధాన వేడుకలకు కూడా హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. ఏర్పాట్ల పరిశీలనలో ఆర్డీవో శ్రీనివాస రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి, ఏవో మంజుల, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమర స్ఫూర్తితో గద్వాల గర్జన!

**త్రివర్ణ పతాకాలతో కదం తొక్కిన సముద్రం.. హోరెత్తిన 'భారత్ మాతా కీ జై' నినాదాలు**

**దేశద్రోహుల కుట్రలను తుత్తునియలు చేయాలి: ఎంపీ డీకే అరుణ తీవ్ర ఆగ్రహం**

**2047 నాటికి 'వికసిత్ భారత్‌'తో ప్రతీ భారతీయుడి లక్ష్యం కావాలి**

**గద్వాల ఆగస్టు 14 (వుదయం కరస్పాండెంట్)**



దేశ శత్రువుల కుట్రలకు చరమగీతం పాడుతూ, స్వతంత్ర భారతావని ఆత్మ గౌరవాన్ని చాటిచెబుతూ జోగులాంబ గద్వాల గడ్డపై దేశభక్తి ఉప్పొంగింది! స్వాతంత్ర్య దినోత్సవ వేళ 'ఇంటింటికీ త్రివర్ణ పతాకం' పిలుపుతో జిల్లా కేంద్రం ఒక విప్లవ క్షేత్రాన్ని తలపించింది. గురువారం నిర్వహించిన 'త్రివర్ణ పతాక ప్రదర్శన' జనసందోహంతో పోటెత్తింది. చేతుల్లో మువ్వన్నెల జెండాలు బూని వేలాది మంది యువకులు, విద్యార్థులు, పౌరులు ఏకమై కదం తొక్కడంతో గద్వాల వీధులన్నీ విప్లవ శోభతో రగిలిపోయాయి. సమర భేరిలా శోభాయాత్ర స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ జాతీయ జెండాను చేతబూని ఈ మహోద్యమాన్ని ప్రారంభించారు. పాత బస్సు నిలయం, కృష్ణవేణి చౌరస్తా, రాజీవ్ మార్గ్‌ల గుండా సాగిన ఈ యాత్రలో ప్రజల 'వందేమాతరం' నినాదాలు మిన్నుముట్టాయి. ప్రధాన రహదారులన్నీ త్రివర్ణమయమై, శత్రు మూకల గుండెల్లో రైళ్లు పరిగెత్తించేలా దేశభక్తి స్ఫూర్తిని రగిలించాయి. శత్రువుల కుట్రలను తిప్పికొడతాం: ఎంపీ డీకే అరుణ హెచ్చరిక ప్రదర్శన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఎంపీ డీకే అరుణ అత్యంత ఘాటుగా, ఆవేశ పూరితంగా ప్రసంగించారు. దేశ సమగ్రతను, ఐక్యతను దెబ్బతీయాలని చూసే అంతర్గత, బాహ్య శత్రువుల కుట్రలను భారతీయులంతా ఐక్యంగా తిప్పికొట్టాలి. దేశభక్తి అనేది సామాజిక మాధ్యమాల వేదికలకో, కేవలం మాటలకో పరిమితం కాకూడదు.. ప్రతీ పౌరుడి రక్తం నరనరాన ప్రవహించాలి! ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2047 నాటికి 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారత్) సాధించడమే మన ఏకైక లక్ష్యం. నవభారత నిర్మాణంలో యువతరం బాధ్యతాయుతమైన సైనికుల్లా ముందడుగు వేయాలి. — డీకే అరుణ, మహబూబ్‌నగర్ ఎంపీ జనప్రభంజనం.. పోటెత్తిన సమర స్ఫూర్తి ఈ త్రివర్ణ పతాక యాత్ర కేవలం ఒక కార్యక్రమంగా కాక, జాతి ఆత్మగౌరవ సమరంగా మారింది. వైద్యులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, యువకులు కులమతాలకు అతీతంగా అపూర్వంగా తరలివచ్చారు.

కార్యక్రమంలో జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు రామాంజనేయులు, కీలక నాయకులు రామచంద్రారెడ్డి, బండల వెంకటరాములు, మిర్జాపురం వెంకటేశ్వర్‌రెడ్డి, బలిగేరా శివారెడ్డి, ప్రజా ప్రతినిధులు, వివిధ విభాగాలు మరియు యువజన మోర్చా నాయకులు భారీగా పాల్గొని గద్వాల గడ్డపై జాతీయవాద పతాకాన్ని సమున్నతంగా ఎగురవేశారు.

## చిన్నంబావి మండల కేంద్రంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు కురువ చిన్న మల్లయ్య**

**జిల్లా జనరల్ సెక్రటరీ జగ్గారి శ్రీధర్ రెడ్డి**

**చిన్నంబావి మండల అధ్యక్షులు బొగ్గు కురుమయ్య**

**చిన్నంబావి మండలం 14 ( వుదయం రిపోర్టర్ )**

చిన్నంబావి మండల కేంద్రంలోని బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర నాయకులు కురువ చిన్న మల్లయ్య, జిల్లా జనరల్ సెక్రటరీ జగ్గారి శ్రీధర్ రెడ్డి, హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జాతీయ జెండాను కార్యకర్తలు, నాయకులతో కలిసి చిన్నంబావి మండలంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీగా నడిచారు. చిన్నంబావి చౌరస్తా నుండి పోలీస్ స్టేషన్ వరకు బయలుదేరి తిరిగి ఎమ్మార్వో ఆఫీస్ కూడలి నుండి తిరిగి అంబేద్కర్ విగ్రహం వరకు ట్రాక్టర్ ర్యాలీ, మరియు విద్యార్థులతో చౌరస్తా వరకు సాగింది. చౌరస్తాలో జనగణమన జాతీయ గీతాలాపనతో కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో చిన్నంబావి మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య, రాష్ట్ర బిజెపి నాయకులు కురువ చిన్న మల్లయ్య, బీజేపీ నాగర్ కర్నూలు జిల్లా జనరల్ సెక్రెటరీ జగ్గారి శ్రీధర్ రెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి మేకల చెన్నయ్య యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్, ఎం లింగ స్వామి, జింకల కిరణ్ కుమార్, వెంకటస్వామి, మండ్ల గోపాల్ నాయుడు, ఎన్ బాలయ్య నాయుడు, వివేకానంద స్కూల్ ప్రిన్సిపాల్ లింగస్వామి మరియు స్కూలు ఉపాధ్యాయులు, తదితరులు బిజెపి నాయకులు పాల్గొన్నారు.





## మృతుడి కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం

**దౌల్తాబాద్ ఆగస్టు 14(వుదయం):**

ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన చాకలి యాదయ్య కుటుంబానికి తిమ్మక్‌పల్లి గ్రామానికి చెందిన గంగి యాదగిరి ఆర్థిక సాయం అందించారు. తన తండ్రి గంగి రాములు జ్ఞాపకార్థం బాధిత కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.శుక్రవారం రాయపోల్ మండల కేంద్రంలో బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా తిమ్మక్‌పల్లి సర్పంచ్ సత్తు అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. యాదయ్య ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందడం ఎంతో బాధాకరమన్నారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు గంగి యాదగిరి ముందుకు వచ్చి ఆర్థిక సాయం చేయడం అభినందనీయమన్నారు.యాదయ్య మృతిపట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మధురెడ్డి,



యాదగిరి, ఎల్లం, రాయపోల్ వార్డు సభ్యుడు పరశురాములు పాల్గొన్నారు.

## దాతల సహకారంతో విద్యార్థులకు క్రీడా దుస్తులు, పాఠ్యపుస్తకాలు

**దౌల్తాబాద్, ఆగస్టు 14 (వుదయం):**

దాతల సహకారంతో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందజేసినట్లు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం రాయపోల్ మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రుల సమక్షంలో వీటిని పంపిణీ చేశారు.

భాగన్నగారి రవీందర్‌రెడ్డి, భాగన్నగారి రవికిరణ్‌రెడ్డి సహకారంతో యూకేజీ విద్యార్థులకు క్రీడా దుస్తులు, పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు దాతలు



అందించిన సహకారం అభినందనీయమన్నారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి ఉదారంగా సహకరించిన రవీందర్‌రెడ్డి, రవికిరణ్‌రెడ్డిలకు పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు.విద్యార్థుల చదువుతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమంతరెడ్డి, రంగారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దౌల్తాబాద్‌లో దొంగల బీభత్సం

**ఒకే రాత్రి మూడు చోట్ల చోరీలు.. భయాందోళనలో ప్రజలు**

**దౌల్తాబాద్, ఆగస్టు 14 (వుదయం):**

మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లో గురువారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. ఒకే రాత్రి మూడు చోట్ల చోరీలు, చోరీకి యత్నించిన ఘటనలు చోటుచేసుకోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అంగన్‌వాడీ ఆయా జీర్కపల్లి భాగ్య (భాగ్యమ్మ) ఇంట్లోకి దొంగలు ప్రవేశించి సుమారు రూ.10 వేల నగదు, తులం బంగారం, 80 తులాల వెండి అపహరించినట్లు సమాచారం. అలాగే బోడోళ్ల సత్యనారాయణగౌడ్, పద్మిని కిష్టయ్య చిన్న కుమారుడు పద్మిని రజనీకాంత్ కు చెందిన స్పెండర్ ప్లస్ ద్విచక్ర (కొత్త ద్విచక్ర వాహనం) వాహనాన్ని కూడా దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలిసింది.



ఆలయానికి ఉన్న తాళాలను పగులగొట్టి లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించినట్లు స్థానికులు తెలిపారు. ఒకే రాత్రి వరుస ఘటనలు చోటుచేసుకోవడంతో గ్రామస్తుల్లో ఆందోళన నెలకొంది.

వరుస చోరీలపై పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులను త్వరగా గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. రాత్రివేళల్లో పోలీసు గస్తీని ముమ్మరం చేసి ప్రజలకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## కొత్లాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు షూ, టై పంపిణీ!

**కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యార్థుల రూపకల్పన**

**గ్రామ సర్పంచ్ పి చంద్రకళ వెంకటరామిరెడ్డి**

**తాండూర్ ఆగస్టు 14 వుదయం ప్రతినిధి**

తాండూర్ మండల పరిధిలోని కొత్లాపూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులతో సమానంగా సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది. అందులో భాగంగా శుక్రవారం పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలతో పాటు షూ, టైలు, బెల్టులను ఘనంగా పంపిణీ చేశారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు వినోద్ పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమానికి కొత్లాపూర్ గ్రామ సర్పంచ్ పి.చంద్రకళ వెంకట్రాం రెడ్డి ముఖ్య అతిథిగా





హాజరై, విద్యార్థులకు స్వయంగా బూట్లు, షూ, టైలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రకళ వెంకట్రాం రెడ్డి మాట్లాడుతూ —— "ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఏ విషయంలోనూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల పిల్లలకు తీసిపోకూడదు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి" అని ఆకాంక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, సరైన వస్త్రధారణ ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇస్తాయని పేర్కొన్నారు.పాఠశాల హెచ్ఎం వినోద్ మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర వికాసానికి ప్రభుత్వం మరియు గ్రామ పంచాయతీ అందిస్తున్న సహకారం అభినందనీయమని, కార్యక్రమానికి విచ్చేసి విద్యార్థులను ప్రోత్సహించిన సర్పంచ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రాజు, ఉపాధ్యాయులు ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు



# విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

**జిల్లా కలెక్టర్**
**మహబూబ్‌నగర్ ఆగష్టు 14**
**(వుదయం ప్రతినిధి)**

జిల్లాలోని పి.ఎం. శ్రీ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న కేంద్ర నిధులను నిబంధనల ప్రకారం సక్రమంగా వినియోగించి, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని అన్ని పి.ఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ పాఠశాలల్లో కేంద్ర నిధుల వినియోగం, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పి.ఎం.శ్రీ ద్వారా పాఠశాలలకు అందిన నిధులను పాఠశాల అవసరాలకు అనుగుణంగా వినియోగించి, ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలిచేలా పి.ఎం.శ్రీ పాఠశాలలను అభివృద్ధి చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న నిధులను వచ్చే వారంలోపు పూర్తిస్థాయిలో వినియోగించాలని ఆదేశించారు.పాఠశాలల్లో డ్రైనేజీ, గేట్లు, తలుపులు, కిటికీలు, ఫ్యాన్లు, లైట్లు, ర్యాంపులు తదితర సౌకర్యాల్లో చిన్నపాటి లోపాలు కూడా లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా బాలికల మరుగుదొడ్లలో తలుపులు, లైట్లు వంటి సౌకర్యాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, తరగతి గదుల్లోని అన్ని ఫ్యాన్లు పనిచేసేలా చూడాలని సూచించారు. దెబ్బతిన్న తలుపులు, కిటికీలు, ర్యాంపులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు.విద్యార్థులకు అందిస్తున్న స్వీయ రక్షణ శిక్షణను కేవలం నిధుల వినియోగం కోసం నిర్వహించే కార్యక్రమంగావి చూడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థులకు వాస్తవంగా స్వీయ రక్షణ నైపుణ్యాలు అందుతున్నాయా లేదా పరిశీలించాలని, శిక్షణా సామగ్రి, ఇతర వసతులను సమర్థవంతంగా వినియోగించి కార్యక్రమాన్ని ప్రయోజనకరంగా నిర్వహించాలని సూచించారు.పాఠశాలలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా, సక్రమంగా నిర్వహించి విద్యార్థులకు ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు పరస్పరం తమ అనుభవాలు, ఉత్తమ విధానాలను పంచుకుని, ఒక పాఠశాలలో విజయవంతమైన కార్యక్రమాలను ఇతర పాఠశాలల్లోనూ అమలు చేసేలా సహకారం పెంపొందించుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని తదితరులు పాల్గొన్నారు.

# వెన్నెల పాల కేంద్రం,ప్రారంభోత్సవానికి



**హాజరైన చిన్నంబావి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు**
**సీనియర్ నాయకులు పెబ్బేటి రామచంద్రారెడ్డి**
**నాయకులు ఇటిక్యాల కృష్ణ ప్రసాద్ యాదవ్**
**సీనియర్ నాయకులు జంగం బీచుపల్లి యాదవ్**
**కొప్పునూర్ సర్పంచు వడ్డేమాన్ బిచ్చన్న**
**చిన్నంబావి మండలం 14**
**( వుదయం రిపోర్టర్ )**

చిన్నంబావి మండల కేంద్రంలోని రాజ్ కుమార్ నాయుడు సారథ్యంలో మండల కేంద్రవెన్నెల పాల కేంద్రం, శ్రీ విఘ్నేశ్వర కమ్యూనికేషన్స్, జిరాక్స్ సెంటర్, ఇంటర్నెట్, టూర్స్ ట్రావెల్స్ ప్రారంభోత్సవానికి ప్రోపరేటర్ రాజ్ కుమార్ నాయుడు ఆహ్వానం మేరకు చిన్నంబావి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెబ్బేటి రామచంద్రా రెడ్డి, మాజీ జెడ్పిటిసి ఇటిక్యాల కృష్ణ ప్రసాద్ యాదవ్, సీనియర్ నాయకులు జంగం బీచ్పల్లి యాదవ్, కొప్పునూరు గ్రామ సర్పంచ్ వడ్డేమాన్ బిచ్చన్న, ముఖ్యఅతిథిగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ విఘ్నేశ్వర కమ్యూనికేషన్స్ అన్ని రకాల ఇంటర్నెట్ సేవలు, ఆన్‌లైన్ అప్లికేషన్లు, మనీ ట్రాన్స్ఫర్, పాన్ కార్డ్, ఆధార్ సేవలు, రైల్వే/బస్ టికెట్లు, రీచార్జ్ లు, కలర్ జిరాక్స్, 7 సీటర్ ఎర్టిగా కారు, ఈ వ్యాపారం విజయవంతంగా నడవాలని ఆ దేవుని ఆశీస్సులు మీకు ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో చిన్నంబావి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంచంద్రారెడ్డి. జంగ బీచుపల్లి యాదవ్, కృష్ణ ప్రసాద్ యాదవ్, కొప్పునూరు గ్రామ సర్పంచ్ వడ్డేమాన్ బిచ్చన్న, పెబ్బేటి తేజ రెడ్డి, తగరం కాన్సిరాం, తగరం శ్రీనివాసులు, కాకనూరు మునిస్వామి, పానుగంటి బాల వెంకట్, పరిమళ చెన్నయ్య, భాస్కర్, జూపల్లి యువసేన నాయకుడు కత్తి జానీ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతుల్లేకుండా మట్టి తవ్వితే కఠిన చర్యలు!

**గద్వాల ఆగస్టు 14**
**(వుదయం బ్యూరో)**

జిల్లాలో గుట్టలను ఇష్టారాజ్యంగా తవ్వేస్తే ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ స్పష్టం చేశారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మట్టి తవ్వకాలను క్రమబద్ధీకరించడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా పక్కా విధానం రూపొందించాలని సూచించారు.గుట్టలు గుర్తించి.. బ్లాకులుగా విభజించిమట్టి తవ్వకాలపై శుక్రవారం ఐడీఓసీలోని తన ఛాంబర్ నుంచి కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి వీసీ ద్వారా ప్రీఆక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా గుట్టలు, మట్టి తవ్వకాలకు అనువైన ప్రాంతాలను గుర్తించి బ్లాకులుగా విభజించాలని ఆదేశించారు. మైనింగ్, జియోలాజికల్ శాఖలు సమన్వయంతో ఆయా ప్రాంతాలను పరిశీలించి నిబంధనల మేరకు వేలం నిర్వహించాలని సూచించారు. అనధికారిక తవ్వకాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు అధికారికంగా అనుమతులు మంజూరు చేయడం ద్వారా ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు. జనావాసాలకు 200 మీటర్ల దూరం

మట్టి తవ్వకాల విషయంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జనావాసాలకు కనీసం 200 మీటర్ల దూరంలోనే మట్టి తవ్వకాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించి తవ్వకాలు చేపట్టే వారిపై ఎలాంటి మినహాయింపులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారుల సమన్వయంతో పర్యవేక్షణ జిల్లాలో మట్టి తవ్వకాలపై సంబంధిత శాఖలు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అక్రమ తవ్వకాలకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు, అనుమతుల ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, మైనింగ్ ఏడీ ఆనంద్, సర్వే ఏడీ నూకరాజు, భూగర్భ జల శాఖ డీడీ మోహన్, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# రైతుల సంక్షేమమే ధ్యేయం.. ప్యాక్స్‌ను బలోపేతం చేస్తాం

**బెజ్జంకి ప్యాక్స్ చైర్మన్‌గా ఒగ్గు దామోదర్ ప్రమాణ స్వీకారం**
**బెజ్జంకి, ఆగస్టు 14**
**(వుదయం ప్రతినిధి)**



సిద్దిపేట జిల్లా బెజ్జంకి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) నూతన చైర్మన్‌గా ఒగ్గు దామోదర్ ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌తో పాటు నూతన డైరెక్టర్లు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చౌరస్తా నుంచి ప్రాథమిక సహకార సంఘం బ్యాంకు వరకు భారీ ఎడ్లబండ్ల ర్యాలీ నిర్వహించి నూతన పాలకవర్గానికి ఘన స్వాగతం పలికారు.

మండల కేంద్రంలోని ఏసీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై నూతన చైర్మన్ ఒగ్గు దామోదర్, డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతులకు అవసరమైన రుణాలు, వ్యవసాయ సేవలు, ప్రభుత్వ పథకాలు సకాలంలో అందేలా ప్యాక్స్ పాలకవర్గం కృషి చేయాలని సూచించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి చొరవ చూపాలని, సహకార సంఘ బ్యాంకును మరింత బలోపేతం చేసి రైతులకు అండగా నిలవాలని కోరారు.కష్టపడ్డ ప్రతి ఒక్క కార్యకర్తకు తప్పకుండా పదవులు దక్కుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నూతన చైర్మన్, డైరెక్టర్లు రైతుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని కోరారు.

**రైతులకు అందుబాటులో ఉంటా: ఒగ్గు దామోదర్**

నూతన చైర్మన్ ఒగ్గు దామోదర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్యాక్స్ పరిధిలోని రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా పనిచేస్తూ ప్యాక్స్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్లు చెట్టి రాజు, నూనె రాజేందర్, కట్ట స్వరూప, ఆడకాని నర్సింగం, గంగాధర రామచంద్రం, కేడిక అపర్ణ, బైర రాజేందర్, తుమ్మ సుధాకర్‌రెడ్డి, మాశం శంకర్, లింగాల రామవ్వ, కొమ్మూరా తిరుపతి, కుక్కల రాములు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కుల సాధనకు మరో ఉద్యమం

**-సీఎం సొంత జిల్లా నుంచే ఈజీహెచ్‌ఎస్ సాధన కోసం ఉద్యమం**
**-25 వేల మంది జర్నలిస్టుల కుటుంబాలు మీకు పట్టవా**
**-జర్నలిస్టుల ఆమోదమే రెఫరండం**
**మన యూనియన్ తెలంగాణ జర్నలిస్టు ల ఆత్మ గౌరవ ప్రతీక**
**- స్వరాష్ట్ర ఉద్యమానికి దండుగా నిలిచింది మనమే...**
**- ఇండ్ల స్థలాలు జర్నలిస్టు ల హక్కు**
**ప్రతి జర్నలిస్టు కి కార్పొరేట్ వైద్యం అందించాలి...**
**- ముద్రకాని ముద్ర పేపర్ కు రాష్ట్ర వ్యాప్తంగా అక్రిడీయూషన్ కార్డులు**
**టీయూడబ్ల్యూహెచ్143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్**
**నాగర్ కర్నూల్ ఆగస్టు 14**
**(వుదయం బ్యూరో)**



జర్నలిస్టుల హక్కుల సాధన కోసం సీఎం సొంత జిల్లా నుంచి శ్రీకారం చుడదామని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ హెచ్ 143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కానీ మారుతి సాగర్ పిలుపునిచ్చారు. శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో రాష్ట్ర సహాయ కార్యదర్శి అబ్దుల్లా ఖాన్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు మునగాల చంద్రశేఖర రావు అధ్యక్షతన నిర్వహించిన యూనియన్ ముఖ్య నాయకుల జిల్లా స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ ఉద్యోగులకు 25 లక్షల మంది కుటుంబాలకు ఉచిత ఆరోగ్య భీమా పథకాన్ని వర్తింపచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం 25 వేల మంది జర్నలిస్టు కుటుంబాలకు ఆరోగ్య భీమా అందించడానికి ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీ పథకం లో ఈ జి హెచ్ ఎస్ తరహా పథకాన్ని జర్నలిస్టులకు వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనేక వేదికల మీదుగా రాష్ట్ర ప్రభుత్వానికి ఈ అంశంపై చెప్పిన స్పందన లేదని సీఎం సొంత జిల్లా గడ్డపై నుంచి జర్నలిస్టుల హక్కుల సాధన కోసం మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టబోతున్నామని మారుతి సాగర్ అన్నారు.తెలంగాణ జర్నలిస్టు ల ఆత్మగౌరవ ప్రతీక TUWJ H 143 అని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగిన TUWJ 143 జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జిల్లా అధ్యక్షులు చంద్ర శేఖర్ రావు,రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్లా అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా TUWJ H 143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్,రాష్ట్ర నాయకులు యోగి,డిల్లి భాస్కర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈ సందర్భంగా మారుతి సాగర్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ జర్నలిస్టులు ఎన్నో అగచాట్లు పడ్డారని అన్నారు.అన్నాడు తెలంగాణ జర్నలిస్ట్ ల పై నిషేధాలు విధించారని అన్నారు.సాగర హారం,మిలియన్ మార్చ్,ఉస్మానియా విద్యార్థి ఉద్యమాలకు దండుగ నిలిచింది మన యూనియనే అని అన్నారు.తెలంగాణ రాక ముందు TUWJ IJU జర్నలిస్టు లకు చేసిందేమి లేదని దుయ్యబట్టారు.రాష్ట్ర వ్యాప్తంగా నాటి BRS అధికారంలో పలు జిల్లాల్లో జర్నలిస్టులకు ఇల్ల స్థలాలు ఇచ్చామని గుర్తు చేశారు.రాష్ట్రంలో అనర్హత కలిగిన పత్రికలకు అక్రిడీయేషన్ ఇచ్చారని అన్నారు.11వేల సభ్యులతో మనే రాష్ట్రంలో ఏకైక పెద్ద సంగమని అన్నారు.

పోరాటం కొత్తకాదు.... రాష్ట్ర కోశాధికారి యోగి పోరాటం మనకు కొత్తకాదని TUWJ H 143 రాష్ట్ర కోశాధికారి యోగి అన్నారు.జర్నలిస్టు లు చాలా సమస్యలు ఎదుర్కొన్నారు.TUWJ 143 అధికారంలో ఉన్నప్పుడు జర్నలిస్టు ల సంక్షేమానికి కొత్త కొత్త పథకాలు పెట్టామని అన్నారు.ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంత రిపోర్టర్ లు ..పత్రికలు తీరని అన్యాయానికి గురయ్యాయని అన్నారు.నాటి సీఎం కేసీఆర్ జర్నలిస్టు ల సంక్షేమం కోసం 10 కోట్ల నిధులు అడిగితే 40కోట్ల రూపాయలు మంజూరు చేసిన ఘనత కేసీఆర్ దని అన్నారు. కొవిడ్ బారిన పడ్డ జర్నలిస్టులకు 10వెలుమొదటి విడత 20వెలు రెండో విడత మంజూరు చేశామని అన్నారు. ఐక్యంగా ఉద్యమాల ద్వారానే మన సమస్యాలను పరిష్కారం చేసుకోవాలని అన్నారు.ప్రతి జర్నలిస్టు TUWJ H 143 లో సబ్యత్వం కలిగి ఉండాలని అన్నారు. 252 జి ఓ జర్నలిస్టు లకు విఘాతం...TUWJ రాష్ట్ర నాయకులు భాస్కర్ జర్నలిస్టు ల సంక్షేమ ముఖ్యంగా యూనియన్ పనిచేయాలనీ రాష్ట్ర నాయకులు భాస్కర్ అన్నారు. TUWJ 143 దేశ వ్యాప్తంగా ప్రధాన యూనియన్ కాబోతుంది.143 కి IJU గుర్తింపు రాబోతుందనున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జెమిని సురేష్, మహమ్మద్ రఉఫ్, చందు నాయక్, జిల్లా కార్యదర్శి రాజేష్ గౌడ్,అహ్మదుల్లా ఖాన్ ,శేఖరా చారి, రావూఫ్, ఉర్దూ జర్నలిస్టులు ఫరీద్ అహ్మద్, షేక్ యాకుబ్ బాబాజీర్, నాగశేశయ్య, మల్లిపెద్ది రమేష్, సురేష్,భాస్కర్ బాబు సాగర్, సత్యం, బాలస్వామి, దుబ్బ నాగేశ్వర్, ఫాయాజ్,యూసఫ్,దేవరాజ్ పాల్గొన్నారు.

# పాలమూరు గుండెల్లో జలసవ్వడి!

**గద్వాల గడ్డపై జలవిప్లవం.. కేబినెట్ భేరీ!**
**కరువు బీళ్లకు చరమగీతం.. ₹1,781 కోట్లతో 'గట్టు' రీడిజైన్‌కు రేవంత్ సర్కార్ జై!**
**15 టీఎంసీలకు గుడ్డెం దొడ్డి.. 2 లక్షల ఎకరాలకు పసిడి భరోసా!**
**గద్వాల ఆగస్టు 14**
**(వుదయం బ్యూరో)**

తరతరాల కన్నీటి దాహార్తికి కడిగిన జలప్రసాదం లభించబోతోంది! ఎండమావులుగా మారిన పాలమూరు బీళ్లకు శాశ్వత ప్రాణప్రతిష్ట చేసేందుకు కాలం ఎదురుచూసిన ఘడియ రానే వచ్చింది. చుక్క నీటి కోసం దశాబ్దాలుగా నడుం వాల్చని గద్వాల రైతాంగ పోరాటానికి, చెమట చుక్కల త్యాగానికి రాష్ట్ర ప్రభుత్వం ఐతిహాసిక ముద్ర వేసింది. నియోజకవర్గ సాగునీటి ముఖచిత్రాన్ని సమూలంగా తిరగరాస్తూ, కరువు రాక్షసి పీచమణిచేలా రాష్ట్ర కేబినెట్ సంచలన నిర్ణయాన్ని ప్రకటించింది. శ్రావణ మేఘంలా గద్వాల నేలకు ఊపిరిలూదుతూ.. నల్ల సోమనాద్రి గట్టు ఎత్తిపోతల పథకం నీటి నిల్వ సామర్థ్యాన్ని 1.3 టీఎంసీల నుంచి ఏకంగా 3 టీఎంసీలకు పెంచుతూ, ₹1,781 కోట్ల భారీ అంచనా వ్యయంతో ప్రాజెక్టు రీడిజైన్‌కు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. అంతేకాదు, ప్రాంతీయ వ్యూహాత్మక జలాశయం గుడ్డెం దొడ్డి సామర్థ్యాన్ని ఏకంగా 15 టీఎంసీలకు పెంచేందుకు తుది వ్యూహాన్ని ఖరారు చేసింది. శుక్రవారం గద్వాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమో హన్‌రెడ్డి అత్యంత ఆవేశపూరితంగా, గంభీరంగా ఈ వివరాలను వెల్లడించారు.కాగితాల నుంచి కదన రంగానికి.. నిధుల సునామీ! గద్వాల నియోజకవర్గాన్ని ధాన్యపురాశిగా మార్చేందుకు ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా నిధుల సునామీ సృష్టించింది. క్షేత్రస్థాయిలో పనులు పరుగులు తీసేలా స్పష్టమైన బ్లూప్రింట్ సిద్ధం చేసింది: గట్టు ఎత్తిపోతల రీడిజైన్ అంచనా వ్యయం: ₹1,781 కోట్లుగుడ్డెం దొడ్డి భూసేకరణకు తక్షణ కేటాయింపు: ₹165 కోట్లు డి పి ఆర్ పనులకు (ఏజెన్సీకి) కేటాయింపు: ₹15 కోట్లు బీడు భూములకు శాశ్వత సమాధి.. చివరి ఎకరాకూ జలముద్దు! ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే గట్టు మండలంతో పాటు నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న వేలాది ఎకరాల పాత కరువు భూములు సస్యశ్యామల కాసారాలుగా మారనున్నాయి. ప్రాజెక్టు సామర్థ్యం ఊహించని రీతిలో పెరగడంతో, నీటి కోసం ఏళ్ల తరబడి సాగిన అరిగోసకు శాశ్వత చరమగీతం పాడనున్నారు. చివరి ఆయకట్టులోని చివరి ఎకరాను కూడా తడిపి తీరడమే మన లక్ష్యం! జోగులాంబ గద్వాల జిల్లాలోని సుమారు 2 లక్షల ఎకరాల నేలకు ఏటా రెండు పంటల పారకం అందించడమే ఈ ప్రతిష్ఠాత్మక నిర్ణయం వెనుక ఉన్న అసలైన జల సంకల్పం."— బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేనాయకులకు రైతాంగ నివాళులురైతన్నల నిరీక్షణను నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గద్వాల రైతాంగం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సాగునీటి రంగాన్నే కాకుండా, గద్వాల పట్టణ రోడ్ల విస్తరణ పనులను కూడా వేగవంతం చేసి నియోజకవర్గాన్ని మోడల్ ప్రగతిపథంలో నిలుపుతామని ఆయన ఘంటాపథంగా స్పష్టం చేశారు.



# రైతులకు నీళ్లు ఇవ్వలేని అసమర్ధ ప్రభుత్వం

**కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మార్కెట్ ఛైర్మన్ సింగం విజయ్ గౌడ్ విమర్శ**
**కల్వకుర్తి, ఆగస్టు 14**
**(వుదయం ప్రతినిధి):**



రైతులకు నీళ్లు ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ అని మాజీ మార్కెట్ ఛైర్మన్ సింగం విజయ్ గౌడ్ ఆరోపించారు.శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ పంపులను ఆన్ చేసి నీళ్లు వదులుతున్నామని ప్రభుత్వం ఆర్భాటం చేస్తుందే తప్ప, మూడు పంపులను ఒకేసారి నడపాలన్న అవగాహన, పర్యవేక్షణ లేదని మండిపడ్డారు.మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆగస్టు 11లోపు పంపులు ఆన్ చేయకపోతే BRS వర్కింగ్ ప్రెసిడెంట్ KTRతో కలిసి ప్రాజెక్టులను సందర్శిస్తామని హెచ్చరించిన తర్వాతే ప్రభుత్వంలో చలనం వచ్చిందన్నారు. కల్వకుర్తి చివరి ఆయకట్టు 162 కిలోమీటర్లకు నీళ్లు చేరాలంటే మూడు పంపులు ఒకేసారి నడపాలని, అది కూడా తెలియని దుస్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు.ఒక రోజు ఒక పంపు, మరుసటి రోజు మరో పంపు నడిపితే ఆయకట్టుకు నీళ్లు ఎప్పుడు అందుతాయని ప్రశ్నించారు. KCR హయాంలో జలకళతో నిండిన చెరువులు ఇప్పుడు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని దుయ్యబట్టారు.పోతిరెడ్డిపాడు ద్వారా నీళ్లు తరలిస్తున్న ఆంధ్ర పాలకులకు ఈ ప్రభుత్వం కొమ్ము కాస్తుందని ఆరోపించారు. ప్రాంత ప్రయోజనాలు కాపాడకపోతే ప్రజాక్షేత్రంలో దోషులుగా నిలబెడతామని హెచ్చరించారు. వెంటనే అన్ని మోటార్లను ఆన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లికల్ సర్పంచ్ జల్లెల కృష్ణయాదవ్, ఉప సర్పంచ్ మున్యా నాయక్, మాజీ సర్పంచ్ నీరటి బాలస్వామి, రైతులు అశోక్, గుండయ్య యాదవ్, జంగయ్య, శివయ్య, రమేష్ పాల్గొన్నారు.

# తాండూరులో విరాజిల్లిన దేశభక్తి

**ఘనంగా 'తిరంగా ర్యాలీ'**
**హాజరైన రాబల్ ఆర్ బి వో ఎల్సీఈఓ , కాంగ్రెస్ సీనియర్ నాయకులు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి**
**తాండూరు ఆగస్టు 14**
**వుదయం ప్రతినిధి**

స్వాతంత్ర్య దినోత్సవ శుభసందర్భాన్ని పురస్కరించుకుని తాండూరు పట్టణంలో 'తిరంగా ర్యాలీ' అత్యంత ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది.

**ఈ సందర్భంగా బుయ్యని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...**

"దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుల త్యాగాలు వెలకట్టలేనివి. వారి త్యాగాలను స్మరించుకుంటూ, దేశ ఐక్యత, సమగ్రతలను కాపాడేందుకు ప్రతి ఒక్క పౌరుడూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి. మన జాతీయ జెండా మనందరిలో దేశభక్తిని, ఐక్యతను మరియు గర్వభావాన్ని నింపే మహోన్నత ప్రతీక" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ పుర ప్రముఖులు, వర్తకవ్యాపారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని, జాతీయ స్ఫూర్తిని చాటుతూ తిరంగా ర్యాలీని మహోజ్జ్వలంగా విజయవంతం చేశారు.



# ప్రజల వద్దకే పాలన ప్రభుత్వ లక్ష్యం

**ప్రతి సోమవారం బిజినపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి**
**బిజినపల్లి, ఆగస్టు 14**
**(వుదయం ప్రతినిధి):**



తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజల వద్దకే పాలన అందించేందుకు ప్రతి సోమవారం "ప్రజావాణి" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.బిజినపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు ప్రజావాణి జరుగుతుందని ఎంపీడీఓ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు.పంచాయతీరాజ్, రెవెన్యూ, వ్యవసాయ, విద్య, వైద్య, మిషన్ భగీరథ, పశుసంవర్ధక, గృహ నిర్మాణ, రోడ్లుభవనాల శాఖలతో పాటు తదితర అన్ని శాఖల మండల స్థాయి అధికారులు ప్రజావాణిలో తప్పనిసరిగా హాజరు కావాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మండల పరిధిలోని గ్రామాల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఇకపై జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా మండల కేంద్రంలోనే ఫిర్యాదులు చేయవచ్చని అధికారులు తెలిపారు. ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని, అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.కావున మండల ప్రజలు ప్రతి సోమవారం ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చి తమ సమస్యలను ప్రజావాణిలో విన్నవించాలని కోరారు.

# మృత నెమలి విక్రయ యత్నం



**ఒకరు అరెస్ట్**
**నాగర్ కర్నూల్ రూరల్, ఆగస్టు 14**
**(వుదయం ప్రతినిధి):**

జిల్లాలో మృత నెమలిని అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నించిన వ్యక్తిని అటవీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.లింగాల మండలం రాంపూర్ గ్రామానికి చెందిన చెన్నయ్య ఈ నేరానికి పాల్పడినట్లు అటవీ అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న అటవీ సిబ్బంది నాగర్‌కర్నూల్ శివారుకు చేరుకుని మృత నెమలిని స్వాధీనం చేసుకున్నారు.

నిందితుడిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 కింద కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ రేంజ్ పరిధిలోని గుడిపల్లి బీట్‌లో చోటుచేసుకుంది.కేసు దర్యాప్తును ఎఫ్ఆర్ఓ ఎం.ఏ. సుబూర్, ఎఫ్ఎస్ఓ బి. సీత, ఎఫ్‌బీఓ శివాజీ పర్యవేక్షిస్తున్నారు.వన్యప్రాణులను వేటాడటం, పట్టుకోవడం, తరలించడం, విక్రయించడం చట్ట విరుద్ధమని అటవీ శాఖ హెచ్చరించింది. అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే అటవీ శాఖకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# పంట పొలాలకు సాగునీరు అందించేందుకే ప్రాజెక్టు పనులు



**--లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేది లేదు**
**--కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కుంభం శివకుమార్ రెడ్డి**
**నారాయణపేట ఆగస్టు14**
**(వుదయం ప్రతినిధి)**

దేశానికి రైతే వెన్నెముక రైతే రాజ్యం అనే నినాదంతో ప్రతి పంట పొలానికి సాగునీరు అందించేందుకు కొడంగల్ నారాయణపేట ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పనులు ప్రారంభించామని దీనిని అడ్డుకునేందుకు కొందరు విశ్వప్రయత్నం చేస్తున్నారని వారి అడ్డుగోడను తొలగించైనా సరే ప్రాజెక్టు పనులను పూర్తి చేస్తామని నారాయణపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కుంభం శివకుమార్ రెడ్డి అన్నారు. కాన్ కుర్తి డ్యామ్ నిర్మాణ పనులను శుక్రవారం ఆయన నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులను మోసం చేసి దొంగ పాసుపుస్తకాలు తీసుకొని ప్రాజెక్టు పనులను ప్రారంభించారని కొందరు నాయకులు ఫిర్యాదు చేశారని ఇది కేవలం వారి రాజకీయ ఉనికి చాటుకునేందుకు మాత్రమే ఫిర్యాదుల పేరుతో కాంగ్రెస్ ను బదనాం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు పనులు నడుస్తున్న గ్రామాలలో భూములు నష్టపోతున్న రైతులతో చర్చించి వారి భూములను తీసుకున్న తర్వాతనే ప్రాజెక్టు పనులు ప్రారంభించామని దీనిపైన అవగాహన లేని కొందరు నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఆయన ఘాటుగా హెచ్చరించారు. భూమి నష్టపోతున్న రైతులకు ఎకరాకు 20 లక్షల రూపాయల చొప్పున అందజేసి వారి భూములను ప్రభుత్వ పరంగా తీసుకుంటున్నామని ఇది గమనించిన నాయకులు రైతులను తప్పుదోవ పట్టిస్తూ కాంగ్రెస్ ను బదనాం చేస్తూ రాజకీయ లబ్ధి కోసమే ఆరాటపడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

# బీజేపీ అప్రజాస్వామిక వైఖరికి వ్యతిరేకంగా కాంగ్రెస్ భారీ ధర్నా

**ఖర్గే ని అవమానించడాన్ని ఖండించిన ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి**
**నాగర్ కర్నూల్, ఆగస్టు 14**
**(వుదయం ప్రతినిధి):**

జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ని అవమానించేలా బీజేపీ వ్యవహరించడాన్ని ఖండిస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బీజేపీ వైఖరిపై నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులపై అవమానకరమైన వ్యాఖ్యలు, చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని పేర్కొన్నారు.ఈ ధర్నాలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు వంకేశ్వర్ నిరంజన్, టౌన్ ప్రెసిడెంట్ జక్కా రాజు, నాగర్‌కర్నూల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్తపల్లి వినోద్ కుమార్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## దేశభక్తుల త్యాగాలను స్మరించుకుంటూ తిరంగా ర్యాలీ: పల్లె కుమార్



**రాయపర్తి**
**ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి):**
ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు బీజేపీ రాయపర్తి మండల అధ్యక్షుడు నూనె అనిల్ ఆధ్వర్యంలో రాయపర్తి మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు.స్థానిక జెడ్పీ హైస్కూల్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించి, విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు కలిసి వందే మాతరం గీతాన్ని సామూహికంగా ఆలపించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పల్లె కుమార్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సంగ్రామంలో అసువులు బాసిన లక్షలాది మంది దేశభక్తుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించడం ప్రతి భారతీయుడి కర్తవ్యమన్నారు.కుల, మత, వర్గ, వర్ణ, ప్రాంత భేదాలకు అతీతంగా ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి తిరంగా ర్యాలీల్లో పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని తెలిపారు.దేశవ్యాప్తంగా తిరంగా జెండాలతో "భారత్ మాతాకీ జై", "వందేమాతరం" నినాదాలు మారుమోగుతున్నాయని అన్నారు.దేశ సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడుతూ దేశాభివృద్ధికి కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి ప్రజలు మద్దతు పలికి, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పల్లె కుమార్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు గడ్డం నరేందర్, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి పెండ్యాల గణేష్, యువ మోర్చా మండల నాయకులు జక్కుల సందీప్ యాదవ్, బండారి దినేష్, రాకేష్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

# మచ్చలేని నాయకుడు!

**కల్లూరు,**
**ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి)**
రాజకీయమంటే ఆడంబరాలు, హంగామా కాదు... ప్రజలకు సేవ చేయడం, వారి కష్టసుఖాల్లో పాలు పంచుకోవడమేనని నిరూపిస్తున్నారు సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్. వివాదరహితులుగా, మచ్చలేని నాయకులుగా ప్రజాక్షేత్రంలో వారికి ప్రత్యేక గుర్తింపు ఉంది.ప్రశాంతతకు కేరాఫ్ అడ్రస్ సత్తుపల్లితెలంగాణ రాష్ట్రంలోనే సత్తుపల్లి నియోజకవర్గం నేడు ప్రశాంతతకు మారుపేరుగా నిలుస్తోంది. అధికారం చేతిలో ఉందని అక్రమ కేసులు పెట్టి వేధించిన దాఖలాలు లేవు. కుట్రలు, కుయుక్తులకు అసలే తావు లేదు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టే నీచమైన రాజకీయ తంత్రాలకు తెరలేపకుండా, ప్రజల కష్టాలే తన కష్టాలుగా భావిస్తూ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారు.డా.బి.ఆర్.అంబేద్కర్ అడుగుజాడల్లో... 70 శాతం ఓటు



బ్యాంకుప్రజా సమస్యలే ఆయుధంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్తున్న తీరు దళిత, గిరిజన, బహుజన వర్గాల్లో డాక్టర్ మట్టా దంపతుల పట్ల అపారమైన నమ్మకాన్ని, ఆదరణను పెంచింది. అన్ని వర్గాల ప్రజలను కలుపుకుపోతూ, సత్తుపల్లి నియోజకవర్గంలో ఏకంగా 70 శాతం ఓటు బ్యాంకును తన సొంతం చేసుకున్న ఏకైక నాయకుడిగా ఆయన రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందారు. చిరునవ్వే బ్రహ్మాస్త్రం.. ప్రతిపక్షాలకు అభివృద్ధే సమాధానంనిరాడంబరతకు మారుపేరైన డాక్టర్ మట్టా దంపతులు ఒక అచ్చమైన ప్రజాస్వామ్యవాది. ఒకే ఒక్క చిరునవ్వుతో ఎన్నో రాజకీయ వ్యూహాలను చిత్తు చేయగల చాణక్యత ఆయన సొంతం. ఆయన వ్యవహార శైలికి ఆకర్షితులై ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు, నాయకులు సైతం ఆయన వైపు అడుగులు వేస్తున్నారు. కొంతమంది ప్రతిపక్ష పార్టీల నాయకులు ఉద్దేశపూర్వకంగా మట్టా దంపతులపై విషం చిమ్ముతూ రాజకీయ కుట్రలు చేస్తున్నా.. వారు ఏమాత్రం సంయమనం కోల్పోలేదు. నియోజకవర్గంలో తాము చేస్తున్న 'అభివృద్ధి, సంక్షేమ పథకాలతోనే' ఆ విమర్శలకు దీటైన సమాధానం చెబుతున్నారు.అలుపెరగని ప్రజాసేవలో మట్టా దంపతులు
అధికారంలో ఉన్నా, లేకపోయినా నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ వారి కోసం ఆశ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి వందల కోట్ల రూపాయల స్వంత నిధులను సైతం ఖర్చు చేసిన మానవతావాదులు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా దంపతులు. తనకు లేదా పార్టీకి నష్టం చేసిన వారిని సైతం క్షమించి, చిరునవ్వుతో ఆదరించి సహాయం చేయడం వారి అతిపెద్ద బలం. రాష్ట్ర మంత్రులతో సఖ్యతగా ఉంటూ నియోజకవర్గానికి దాదాపు ₹1,000 కోట్లకు పైగా నిధులు రాబట్టి సత్తుపల్లి నియోజకవర్గ ఐదు మండలాల్లో ఉన్న పట్టణాలు గ్రామాల రూపురేఖలు మారుస్తున్నారు.శతాబ్దాల కాలంగా పెండింగ్లో ఉన్న అనేక సమస్యలు పరిష్కరించారు.అధికారమంటే ఆడంబరాల కోసం కాదు, ప్రజలకు మంచి చేయడానికే అని తమ ఆచరణ ద్వారా చాటిచెబుతున్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా దంపతుల నాయకత్వాన్ని సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారు.

## స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం



**హనుమకొండ టౌన్,**
**ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి) :**
హనుమకొండ జిల్లా కుమార్ పల్లి ప్రాంతంలోని టైలర్ స్ట్రీట్లో గల స్మైల్ డీజి హైస్కూల్లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం చేసామని పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస వర్మ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు స్మైల్ హైస్కూల్లో అంగరంగ వైభవంగా నిర్వహించబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలు ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల సూచనల మేరకు త్రివర్ణ పతాకం లోని మూడు రంగులతో తయారుచేసిన...వివిధ రకాల తినుబండారాలతో వచ్చిన పిల్లల్ని ప్రిన్సిపల్ శ్రీనివాస వర్మ అభినందించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న వారిని వైస్ ప్రిన్సిపాల్ త్రివేణి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మందరగిరిలో ఘనంగా సామూహిక కుంకుమార్చనలు

**మహాదేవపూర్:**
**ఆగస్టు 14(వుదయం ప్రతినిధి)**
మహాదేవపూర్ శ్రీ మందరగిరి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆండాళ్ తిరునక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు నవీన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవాలయంలో సామూహిక కుంకుమార్చనలు భక్తి శ్రద్ధలతో జరిగాయి అని పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు అని తెలిపారు ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలకు తీర్థప్రసాదాలు, కుంకుమ



పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఆండాళ్ తల్లి ఆశీస్సులతో భక్తులందరికీ సుఖసంతోషాలు, సకల సంపదలు కలగాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు ప్రకటనలో పేర్కొన్నారు.

# జామలాపూర్ లో భూముల రీసర్వే ప్రక్రియ ప్రారంభం



* భూముల రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి
* రీ-సర్వే షెడ్యూల్‌ను ముందస్తుగా రైతులకు తెలియజేయాలి
* పర్వతగిరి తహసిల్దార్ టి. వెంకటస్వామి

**పర్వతగిరి,**
**ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి) :**
భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని, సర్వేకు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే రైతులకు తెలియజేసి వారి సహకారంతో పనులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాల ప్రకారం పర్వతగిరి తహసిల్దార్ టి. వెంకటస్వామి సర్వేయర్లను ఆదేశించారు. పర్వతగిరి మండలం జామలాపూర్ గ్రామంలో భూములు కొలతల శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న భూముల రీసర్వే పనులను తహసీల్దార్ క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రారంభం చేసారు.ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి రోజు ఎన్ని ఎకరాల భూమికి రీసర్వే పూర్తి చేస్తారని రోజువారీగా ఎంత విస్తీర్ణంలో సర్వే నిర్వహిస్తున్నారని, ఎన్ని రోవర్ పరికరాలతో సర్వే చేపడుతారని సర్వేయర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అక్కడ ఉన్న రైతులతో మాట్లాడి రీసర్వే ప్రక్రియ, పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. ప్రస్తుతం గ్రామంలో ఒకటే సర్వే బృందం రీసర్వే పనులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.ఈ సందర్భంగా తహసీల్దార్ టీ. వెంకటస్వామి మాట్లాడుతూ, ప్రతి సర్వే బృందం రోజుకు కనీసం 20 ఎకరాల భూమిని రీసర్వే చేసేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. సర్వే ప్రారంభానికి ముందే కార్యాచరణ రూపొందించి, ఆయా ప్రాంతాల రైతులకు తేదీలు, సమయాలపై ముందస్తు సమాచారం అందించాలని ఆదేశించారు.రైతుల సమన్వయంతో, నిర్దేశిత లక్ష్యాల ప్రకారం ప్రతిరోజూ రీసర్వే చేపడితే ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సర్వే పనుల్లో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా రీసర్వే నిర్వహించాలని సర్వేయర్లకు సూచించారు.ఈ పరిశీలనలో భూములు కొలతల శాఖ సహాయ సంచాలకులు ప్రభుత్వం సర్వేయార్ కుశాల్ , లైసెన్స్ సర్వేయులు 4 గురు జామలాపూర్ జి పి ఓ సారంగా పాణి , వడ్లకొండ జి పి ఓ వెంకటయ్య , బూర్గుమడ్ల జి పి ఓ అనిల్ , జామలాపూర్ సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్ , పడిదెల పరమేశ్వర్ రావు , ఊరుకొండ మోహన్ , వద్దే రామచంద్రు , స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కట్కం అశోక్ నియామకంపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు

**- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బుర్రి శివరాజ్**

**మహాదేవపూర్:**
**ఆగస్టు 14(వుదయం ప్రతినిధి)**
మహాదేవపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కట్కం అశోక్ నియమితులైన సందర్భంగా మండల వాసులు, ముఖ్యంగా బెంగళూరు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బుర్రి శివరాజ్, మాట్లాడుతూ బీసీ వర్గానికి చెందిన కట్కం అశోక్ ను మండల అధ్యక్షుడిగా నియమించినందుకు



రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నూతన అధ్యక్షుడిగా నియామకమైన అశోక్ కు శుభాకాంక్షలు తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తుందని, సామాజిక సమీకరణల ద్వారా గ్రామ స్థాయి నాయకుడికి గుర్తింపు ఇచ్చిన తీరు గొప్పదని కొనియాడారు. అశోక్ నాయకత్వంలో మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని, గ్రామ ప్రజలందరూ మంత్రి శ్రీధర్ బాబు, శ్రీను బాబు కు రుణపడి ఉంటారని అన్నారు.మహదేవపూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు అశోక్ తో నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేస్తామని పేర్కొన్నారు.

## మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించిన మాజీ ఎంపీపీ వేములపల్లి



**ఖానాపురం,**
**ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి):**
మండల కేంద్రానికి చెందిన గర్నెపల్లి సోమయ్య (68) అనారోగ్యంతో మృతి చెందగా మృతదేహాన్ని మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు సందర్శించి మృతదేహంపై పూలమాలసి శ్రద్ధాంజలి ఘటించి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్, ఉప సర్పంచ్ ఉప్పు రాజు, మజీద్ కమిటీ అధ్యక్షుడు వార్డు సభ్యుడు మమ్మద్ అజహర్, నాయకులు గ్రామస్తులు మల్యాల పోశెట్టి, తరాల శ్రీనివాస్, కుందనపెల్లి వీరన్న, తరాల నరేష్, తూనం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీలలో పింఛన్ దరఖాస్తుల స్వీకరణ



**ఖానాపురం**
**ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి):**
మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలోని ఏడు రకాల పింఛన్లపై ఆయా గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులు నేరుగా వెళ్లి అర్హతను బట్టి తమకు కావలసిన పింఛన్లపై ఈనెల 31 లోపు వరకు దరఖాస్తు చేసుకోవాలని 21 గ్రామపంచాయతీలోని లబ్ధిదారులకు మండల అభివృద్ధి అధికారి వనపర్తి అద్వైత తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో అధ్యక్షతన పింఛన్లు, సెంట్రల్ ఫైనాన్స్ నిధులపై ( సీ.ఎఫ్.సీ) సర్పంచులకు కార్యదర్శులకు పంచాయతీ పరిపాలనపై పంచాయతీరాజ్ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో చేయూత పింఛన్లు, 16వ ఆర్థిక సంఘం( సీ.ఎఫ్.సీ) నిధులు, పంచాయతీ పరిపాలనకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించి (సీ.ఎఫ్.సీ)నిధుల వినియోగం పంచాయతీ పరిపాలన గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సర్పంచులకు కార్యదర్శులకు తగిన సూచనలను ఎంపీడీవో తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 21 గ్రామ పంచాయతీ పరిధిలోని వివిధ రకాల పింఛన్ల కోసం లబ్ధిదారుల నుండి గ్రామపంచాయతీలో సర్పంచ్, కార్యదర్శులు నేరుగా దరఖాస్తులను స్వీకరించాలని తెలుపుతూ, లబ్ధిదారులకు కావలసిన సలహా సూచనలను ఇవ్వాలని తెలిపారు. ఏడు రకాల వివిధ రకాల చేయూత పింఛన్లకు సంబంధించినవి వితంతువు, ఒంటరి మహిళల, దివ్యాంగులు, గీత కార్మికులు, ఫైలేరియా బాధితులు, చేనేత కార్మికులు, డయాలసిస్ పేషంట్లకు వివిధ కేటగిరీలలో అర్హులైన లబ్ధిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించాలని ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్లకు కార్యదర్శులకు తెలుపుతూ,ఒంటరి మహిళలకు సంబంధించిన పింఛన్ దరఖాస్తు పరిశీలన జారీ ప్రక్రియ ఎంపీడీవో కార్యాలయం నుండి జరుగుతుందని లబ్ధిదారులకు తెలుపుతూ, గ్రామ పంచాయతీల నుంచి స్వీకరించిన పింఛన్ దరఖాస్తులను మండల కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్ల ద్వారా సంబంధిత పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సునీల్ కుమార్ రాజ్, మండలంలోని 21 గ్రామ పంచాయతీల సర్పంచులు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# పంటల వైవిధ్యంతోనే లాభసాటి వ్యవసాయం



**-మండల వ్యవసాయ అధికారి రజిత బన్న**

**నల్లబెల్లి,**
**ఆగస్టు 14 (వుదయం)**
వర్షాభావం, వాతావరణ మార్పులను అధిగమించి స్థిరమైన ఆదాయం పొందడానికి రైతులు పంటల వైవిధ్యం (క్రాప్ డైవర్సిఫికేషన్) పాటించాలని మండల వ్యవసాయ అధికారి బన్న రజిత సూచించారు. నల్లబెల్లి మండలంలోని కన్నరావుపేట, మామిండ్ల వీరయ్యపల్లి గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా నర్సంపేట ఏడీఏ బొమ్మెన శ్రీనివాస్ మాట్లాడుతూ. ఒకే పంటపై ఆధారపడకుండా వరికి ప్రత్యామ్నాయంగా కంది, పెసర, మినుము, వేరుశనగ, చిరుధాన్యాల వంటి తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని కోరారు. కందిలో పెసర వంటి అంతర పంటలు వేయడం ద్వారా ఒకే సీజన్లో రెట్టింపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో డ్రిప్, స్ప్రింక్లర్ విధానాలను పాటించాలని, మట్టి పరీక్షల ఆధారంగానే ఎరువులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు విశ్వభాను, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మేడిశెట్టి జన్మదిన వేడుకలు



**పర్వతగిరి ,**
**ఆగస్టు 14 ( వుదయం ప్రతినిధి ):**
పర్వతగిరి మండల కేంద్రంలో శుక్రవారం మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా అభిమానులు నిర్వహించారు. కేక్ ను అభిమానులు తెప్పించి అందరి కరతాళ ధ్వనుల మధ్య కట్ చేసి కార్యకర్తలు అభిమానులు శాలువాలతో మెడిశెట్టి రాములు సన్మానించి అరటి పండ్లు ప్రజలకు పంచి అభిమానం చాటుకున్నారు.మాజీ జడ్పీటీసీ మెడిశెట్టి రాములు మాట్లాడుతూ మీ ప్రేమాభిమానాలు జీవితాంతం నాకు ఉండాలని కోరారు. వారివెంట నాయకులు సర్పంచ్లు కార్యకర్తలు వందలాదిగా పాల్గొన్నారు.

## దళితుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం..



ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కందికట్ల యాకయ్య

**రాయపర్తి**
**ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి):**
కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ ఈ నెల 30న వరంగల్ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కందికట్ల యాకయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కందికట్ల యాకయ్య మాట్లాడుతూ రాష్ట్ర చైర్మన్ పర్యటనలో భాగంగా జరగబోయే సమావేశానికి మండలంలోని ప్రతి గ్రామం నుండి ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ దళితులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తుందని, ఇందిరాగాంధీ, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఆశయాలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎస్సీ సెల్ ను గ్రామ స్థాయి నుండి బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు .ఈ కార్యక్రమంలో మండల ఇన్చార్జులు రాష్ట్ర కార్యదర్శి ఆరూరిరాజు, జన్ను నర్సన్న, జిల్లా కార్యదర్శి చిర్ర మల్లయ్య, చినపాక ఎల్లయ్య, చిర్ర శ్రీధర్, ప్రవీణ్, రవి, ఎస్సీ డిపార్ట్మెంట్ నాయకులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం: జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



* దంతాలపల్లి, కాల్వపల్లి గ్రామాల్లో స్వయంగా బైక్‌పై వెళ్లి సర్వే పనుల పరిశీలన
* పెద్ద ముప్పారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో వర్చువల్ అసెస్మెంట్ తనిఖీ

**మహబూబాబాద్,**
**ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి) :**
భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ రీసర్వే ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ అండ్ జిల్లా మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్ తెలిపారు. శుక్రవారం దంతాలపల్లి, కాల్వపల్లి గ్రామాల్లో జరుగుతున్న భూ సర్వే పనులను మండల సర్వేయార్ నిత్యతో కలిసి కలెక్టర్ స్వయంగా బైక్‌పై వెళ్లి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 77 గ్రామాలకు గెజిట్ ప్రతిపాదనలు రాగా, మొదటి దశలో 11 గ్రామాల్లో సర్వే కొనసాగుతోందన్నారు. సర్వే పనుల్లో పూర్తి పారదర్శకత పాటిస్తూ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని అధికారులను ఆదేశించారు. రైతులు, పొరుగు భూముల యజమానుల సమక్షంలోనే సరిహద్దు కొలతలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆబాది, ప్రభుత్వ, పట్టాదార్ భూములను ఖచ్చితమైన కొలతలతో రికార్డుల్లో నమోదు చేయాలని సూచిస్తూ, ఈ ప్రక్రియకు ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.అనంతరం మరిపెడ మండలం, దంతాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెద్ద ముప్పారం 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్' ను ఎన్.హెచ్.ఎమ్ (NHM) సెంట్రల్ టీమ్ జాతీయ క్వాలిటీ అసెస్మెంట్ (NQAS) లో భాగంగా వర్చువల్ ద్వారా పరిశీలించింది. ఈ సందర్భంగా కలెక్టర్ దవాఖానలోని రికార్డులు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, రక్త నమూనాల పరీక్షలు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ మరియు ప్రాంగణ పరిశుభ్రతను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, సర్వే శాఖ ఏడీ శ్రీనివాసులు, ఆర్డీవో గణేష్, డాక్టర్ కవిత, క్వాలిటీ మేనేజర్ సురేష్, తాహసిల్దార్ సునీల్ రెడ్డి, ఎంపీడీవో సక్రియ తదితరులు పాల్గొన్నారు.

## కౌశిక్ వ్యాఖ్యలను ఖండించిన దయానంద్

**సత్తుపల్లి**
**ఆగస్టు14( వుదయం ప్రతినిధి)**
రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పై కౌశిక్ రెడ్డి దురుసుగా మాట్లాడుతూ చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్.రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ 2018 కాంగ్రెస్ పార్టీ నుంచి బి ఆర్ ఎస్ పార్టీ లోకి చేరింది నీవు.మా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని విమర్శించే స్థాయి నీది కాదు.స్వతహాగా కాంట్రాక్ట్ వర్కులు చేస్తూ అభివృద్ధి చెందిన నాయకులు మా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. నీవు గొప్పలు చెప్పుకుంటున్న బి ఆర్ ఎస్ పార్టీ హయంలో పేదలకు ఎన్ని ఇండ్లు ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం నియోజక వర్గానికి 3 వేల 500 ఇండ్లు ఇచ్చిన ఘనత మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.మంత్రి పొంగులేటి పెద్ద తరహాగా మాజీ సిఎం కేసీఆర్ కాళ్ళకు దండం పెట్టి ఆశీస్సులు తీసుకున్నారు. అంతే గాని కాళ్ళు పట్టుకోవాల్సిన అవసరం మా మంత్రి కి లేదు.అప్పట్లో పదవులు ఇస్తామని నమ్మించి తడి గుడ్డతో గొంతు కోసిన ఉమ్మడి ఖమ్మం జిల్లా లో తుమ్మల, పొంగులేటి లాంటి నాయకులను వదులుకొని ఘోరంగా ఓడిపోయిన పార్టీ బి ఆర్ఎస్.ప్రజలు ఆదరించారు కాబట్టే మా నాయకులు గెలిచి చూపించారు.రాబోయేది కూడా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే. ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసింది మీ కెసిఆర్ .పదవులు అన్ని కుటుంబానికే ఇచ్చుకున్నారు కాబట్టే ప్రజలు బుద్ధి చెప్పారు.

## కాజీపేట ఆర్ఓబీ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

*** పనుల జాప్యంలో అలసత్వాన్ని సహించేది లేదు: జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**



**హనుమకొండ,**
**ఆగస్టు 14 (వుదయం జిల్లా ప్రతినిధి) :**
కాజీపేటలో నూతనంగా నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. శుక్రవారం కాజీపేటలో కొనసాగుతున్న ఆర్ఓబీ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా, సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తూ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం ఎంతమాత్రం సహించేది లేదని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసేలా అధికారులు నిత్యం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ ఎస్ఈ సురేష్ బాబు, ఆర్ఓబీ నిర్మాణ పనుల పురోగతిని, ఇప్పటివరకు పూర్తయిన పనులు, కొనసాగుతున్న పనుల వివరాలను కలెక్టర్ కు వివరించారు. ఈఈ దేవిక, కాంట్రాక్టర్లు. తదితరులు పాల్గొన్నారు.

# సింగారంలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ గ్రామ పంచాయతీ ప్రారంభం






- **ఎమ్మెల్యేలు, డీఎస్పీకి ఆహ్వాన పత్రాల అందజేత**

**అచ్చంపేట, ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి):**

మండల పరిధిలోని సింగారం గ్రామంలో ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నూతన డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ, నూతన గ్రామ పంచాయతీ ప్రారంభోత్సవం జరుగుతాయి.ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా ఎమ్మెల్యేలు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కూచుకుళ్ల రాజేశ్ రెడ్డిలకు సర్పంచ్ నీలం శేఖర్ యాదవ్, గ్రామ యువకులతో కలిసి క్యాంప్ కార్యాలయంలో ఆహ్వాన పత్రాలు అందజేశారు. అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాస్‌కు కూడా ఆహ్వానం అందించారు.ఈ కార్యక్రమంలో జర్పుల నరేందర్ నాయక్, కొండెమోని బిక్కయ్య, సల్వాది వెంకటేష్, పానుగంటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# మృతునికుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేత



- **బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు కానుగుల జోగయ్య**

**వెల్దండ న్యూస్ ఆగస్టు 14 వుదయం ప్రతినిధి**

వెల్దండ మండల కేంద్రానికి చెందిన వాన రాసి రాములు ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు కానుగుల జోగయ్య మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు మాజీ మండల అధ్యక్షులు కానుగుల జోగయ్య 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్ వార్డు సభ్యులు సిర్సనగండ్ల శేఖర్ బిఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కొమ్ము నాగయ్య, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మంగళగిరి సత్యం,బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు జంగిలి ప్రవీణ్,గోపాల్, బిట్టి సైదులు,వానరాశి రాములు, శివరాజ్, మహేష్, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాల ప్రతిపాదిత స్థలాలను పరిశీలించిన ఎమ్మెల్యే



**అక్బర్‌పేట-భూంపల్లి, ఆగస్ట్ 14, వుదయం:**

అక్బర్‌పేటభూంపల్లి మండలంలో నూతనంగా నిర్మించనున్న తహసీల్దార్ కార్యాలయం, మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవనాల కోసం ప్రతిపాదించిన స్థలాలను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్.సి, ఎస్.టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మండల ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించేందుకు తహసీల్దార్ కార్యాలయ భవనం, ఎంపీడీవో కార్యాలయం ఎంతో అవసరమని అన్నారు. ప్రతిపాదిత స్థలం అనుకూలంగా ఉందని, సంబంధిత ప్రభుత్వ అనుమతులు పొందిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండల ప్రజలకు కార్యాలయాలకు రావడం సులభంగా ఉండేలా, అన్ని వసతులతోకూడిన ఆధునిక భవనాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, గ్రామ గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేసిన శాసనసభ్యుల




- **డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**

**వుదయం మనూరు తేదీ**

మానూర్,మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్, కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో నారాయణఖేడ్,శాసనసభ్యులు పట్లోళ్ల సంజీవరెడ్డి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా.కళాశాలలో నూతనంగా చేరిన.విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం విద్యార్థులకు 12 లాంగ్ నోట్ పుస్తకాలను ఉచితంగా ఎమ్మెల్యే గారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ.విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో. విద్య అత్యంత కీలకమని అన్నారు. పేద, మధ్య తరగతి. కుటుంబాలకు చెందిన.విద్యార్థులకు చదువు విషయంలో.ఎలాంటి ఇబ్బందులు కలగకుండా.ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని.తెలిపారు విద్యార్థులు.ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను. సద్వినియోగం చేసుకుని.కష్టపడి చదివి. ఉన్నత స్థాయికి.ఎదగాలని. ఎమ్మెల్యే సూచించారు.చదువుతో పాటు క్రమశిక్షణ, మంచి నడవడి. సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని.విద్యార్థులకు పిలుపునిచ్చారు.

# సభా వేదిక శుద్ధి ప్రజాస్వామ్యానికి మచ్చ

- **సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గణేష్ పంచమి**

**దౌల్తాబాద్, ఆగస్టు 14(వుదయం):**

ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న బహిరంగ సభ అనంతరం సభా వేదికను శుద్ధి చేయడం ప్రజాస్వామ్య విలువలకు, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గణేష్ పంచమి తీవ్రంగా ఖండించారు. ఈ నెల 8న హల్ద్వానీలోని రామ్‌లీలా మైదానంలో ఖర్గే ప్రసంగించిన అనంతరం కొందరు వేదికను శుద్ధి చేసిన ఘటన దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖర్గే సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారని తెలిపారు. తన ప్రసంగంలో ప్రజా సమస్యలు, దేశ రాజకీయ పరిస్థితులు, రాజ్యాంగ పరిరక్షణ వంటి అంశాలనే ఖర్గే ప్రస్తావించారని అన్నారు. అలాంటి నాయకుడు ప్రసంగించిన వేదికను అపవిత్రమైందంటూ శుద్ధి చేయడం ఒక వ్యక్తిని అవమానించడమే కాకుండా ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ విలువలను అవమానించినట్లేనని విమర్శించారు.అంటరానితనం భావనను ప్రోత్సహించడం సరికాదు

కులం, మతం ఆధారంగా ఒక వ్యక్తి సభా వేదికను అపవిత్రంగా భావించడం రాజ్యాంగం కల్పించిన సమానత్వ స్ఫూర్తికి విరుద్ధమని గణేష్ పంచమి అన్నారు. రాజకీయంగా భిన్నాభిప్రాయాలు ఉండటం సహజమేనని, అయితే ప్రత్యర్థి నాయకులను కించపరిచేలా వ్యవహరించడం ఏ మాత్రం సమర్థనీయం కాదని పేర్కొన్నారు.



ఇలాంటి ఘటనలు సమాజంలో అనవసరమైన విద్వేషాలకు దారితీసే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చూపిన సమానత్వం, సామాజిక న్యాయం, సోదరభావం వంటి విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు.

చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

సభా వేదికను శుద్ధి చేసిన ఘటనపై ప్రభుత్వం సమగ్రంగా విచారణ జరిపి, బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని గణేష్ పంచమి డిమాండ్ చేశారు. అంటరానితనం, కుల వివక్షకు తావులేకుండా కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల్లో సామాజిక సమానత్వం, సోదరభావంపై అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాస్వామ్యంలో అధికార పక్షం, ప్రతిపక్షం అనే తేడా లేకుండా ప్రతి రాజకీయ నాయకుడికి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత అందరిపై ఉందని, వ్యక్తిగత రాజకీయ విభేదాలను సామాజిక విద్వేషాలుగా మార్చకూడదని గణేష్ పంచమి స్పష్టం చేశారు.

# తాండూరులో విరాజిల్లిన దేశభక్తి.. ఘనంగా 'తిరంగా ర్యాలీ'

- **హాజరైన రాబల్ ఆర్ బి వో ఎల్సీఈఓ , కాంగ్రెస్ సీనియర్ నాయకులు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి**

**తాండూరు, ఆగస్టు 14 వుదయం ప్రతినిధి:**

స్వాతంత్ర్య దినోత్సవ శుభసందర్భాన్ని పురస్కరించుకుని తాండూరు పట్టణంలో 'తిరంగా ర్యాలీ' అత్యంత ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఆర్ బి ఓ ఎల్ సీఈఓ , సీనియర్ కాంగ్రెస్ నాయకులు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, జాతీయ జెండాను చేతబూని ర్యాలీని ముందుండి నడిపించారు.స్థానిక నెహ్రూ గంజ్ నుంచి ప్రారంభమైన ఈ శోభాయాత్ర పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా వైభవంగా సాగింది. ర్యాలీ పొడవునా యువత, ప్రజలు మిన్నంటేలా చేసిన దేశభక్తి నినాదాలతో తాండూరు వీధులు మారుమోగాయి.

**దేశ ఐక్యతకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలి:**

ఈ సందర్భంగా బుయ్యని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... "దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుల త్యాగాలు వెలకట్టలేనివి. వారి త్యాగాలను స్మరించుకుంటూ, దేశ ఐక్యత, సమగ్రతలను కాపాడేందుకు ప్రతి ఒక్క పౌరుడూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి. మన జాతీయ జెండా మనందరిలో దేశభక్తిని, ఐక్యతను మరియు గర్వభావాన్ని నింపే మహోన్నత ప్రతీక" అని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పట్టణ పుర ప్రముఖులు, వర్తకవ్యాపారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, యువత మరియు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని, జాతీయ స్ఫూర్తిని చాటుతూ తిరంగా ర్యాలీని మహోజ్జ్వలంగా విజయవంతం చేశారు.




# గైరన్ తండా రోడ్డు నిర్మాణానికి భూమి పూజలో ఎమ్మెల్యే, ఖేడ్ సబ్ కలెక్టర్

- **రోడ్డు భూమి పూజతో**
- **మా తాండాకు ఇప్పుడు స్వాతంత్రం వచ్చింది. తాండవాసులు.**

**నారాయణఖేడ్ ఆగస్టు 14(వుదయం)**

నారాయణఖేడ్ నియోజకవర్గంపరిధిలో నిసిర్గాపూర్ మండలం వాంగ్దల్ గైరన్ తండా( డబ్బు )కు రహదారి నిర్మాణం కోసం సోమవారం శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమ హారతి భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ట్రాక్టర్‌పై తండాకు వెళ్లి, అక్కడ చేపట్టనున్న బ్రిడ్జి నిర్మాణ పనులు, రహదారి నిర్మాణంపై అధికారులతో కలిసి చర్చించారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ

గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని అనేక రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని ఎమ్మెల్యే విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కో రహదారికి మరమ్మతులు చేపడుతూ, నియోజకవర్గంలోని అన్ని రహదారులను దశలవారీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. గైరన్ తండాలో విద్యుత్, తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామపంచాయతీ నిధుల నుంచి కేవలం రూ.4,000 డీడీ చెల్లిస్తే, తండాకు అవసరమైన 10 విద్యుత్ స్తంభాలతో పాటు విద్యుత్ సామగ్రిని అందించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

రోడ్డుకు భూములు ఇచ్చిన రైతులకు సన్మానం చేశారు. తమ భూములను అందించిన రైతులను ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి పనులకు రైతులు సహకరించడం అభినందనీయమని పేర్కొన్నారు.

**మా తాండాకు నిజమైన స్వాతంత్రం ఈరోజు వచ్చింది.**

**తండావాసులు మాట్లాడుతూ....**

"మా తండాకు నిజమైన స్వాతంత్ర్యం ఈరోజు వచ్చిందనీ వర్షం వ్యక్తం చేశారు.రోడ్డు నిర్మాణానికి భూమిపూజ జరగడంతో గైరన్ తండావాసులు ఆనందం వ్యక్తం చేశారు. "దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలు గడిచినా మా తండాకు మాత్రం రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డాం ఎన్నో రోజుల నుంచి ఉన్న సమస్యను ఎమ్మెల్యే సంజీవరెడ్డి మా తండాకు రోడ్డు మంజూరు చేయించి, నిర్మాణ పనులకు భూమిపూజ చేయడంతో మాకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లుగా ఉంది" అని తండావాసులు హర్షం వ్యక్తం చేశారు.70 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న తమ తండా రోడ్డు కలను సాకారం చేస్తున్న ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డికి తండావాసుల తరఫున జీవితాంతం రుణపడి ఉంటామని వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే చొరవతో తమ తండాకు రహదారి, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు అందుబాటులోకి వస్తుండటం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సిర్గాపూర్ మండలం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,వాంగ్దాల్ గ్రామం, గైరన్ తండా ప్రజలు ముఖ్య కార్యకర్తలు, మహిళలు యువకులు సర్పంచులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా యాత్ర

**నారాయణఖేడ్: ఆగస్ట్ 14(వుదయం)**

భారత స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రజల్లో దేశభక్తి భావనను నింపేందుకు నారాయణఖేడ్ పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర ఘనంగా, విద్యార్థులతో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. బీజేపీ నారాయణఖేడ్ పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, మండల అధ్యక్షులు సిందోల్ దశరథ్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే విజయపాల్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప విచ్చేసి, జాతీయ పతాకాలతో శోభితుడైన యాత్రను ప్రారంభించి ముందుకు నడిపించారు. నారాయణఖేడ్ పురవీధుల గుండా సాగిన ఈ ప్రదర్శనలో వందలాది మంది విద్యార్థులు, యువకులు మరియు స్థానిక ప్రజలు జాతీయ జెండాలను చేతబూని భారత్ మాతాకీ జై వందేమాతరం అనే దేశభక్తి నినాదాలతోపట్టణాన్ని మార్మోగించారు. మాజీ ఎమ్మెల్యే విజయపాల్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ జెండా కేవలం ఒక వస్త్రం కాదని, అది కోట్లాది మంది భారతీయుల ఆత్మగౌరవానికి,సార్వభౌమాధికారానికి మరియు త్యాగానికి నిలువెత్తు రూపమని అన్నారు. మన త్రివర్ణ పతాకం కింద మేధావులు, యువకులు, విద్యార్థులందరూ ఒక్కటై దేశాభివృద్ధికి పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప మాట్లాడుతూ గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ తీసుకొచ్చిన హర్ ఘర్ తిరంగా పిలుపు దేశ సరిహద్దుల నుండి పల్లెల వరకు ప్రతి ఒక్కరిలో జాతీయ భావాన్ని రగిలించిందన్నారు. నరేంద్ర మోదీ సమర్థవంతమైన నాయకత్వంలో భారతదేశం ఆర్థికంగా, సాంకేతికంగా ప్రపంచ దేశాల సరసన అగ్రగామిగా ఎదుగుతోందని,భారత్ మాత ప్రపంచ గురువుగా మారే రోజులు దగ్గరలోనే ఉన్నాయని పేర్కొన్నారు.దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందనే విషయాన్ని గుర్తుచేస్తూ, ప్రతి ఒక్కరూ



క్రమశిక్షణ, దేశభక్తి, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని నాయకులు విద్యార్థులకు హితవు పలికారు. చదువుతో పాటు సామాజిక బాధ్యతను కూడా పెంపొందించుకోవాలని కోరారు.జిల్లా ఉపాధ్యక్షులు పత్రీ రామకృష్ణ, ఓబీసీ మోర్చా సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కోణం విఠల్ జిల్లా నాయకులు విలాస్ రావు, మారుతీ రెడ్డి, యువమోర్చ జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్, రవి సుధాకర్, సగుణాకర్,పట్నం మాణిక్, సాయి,నాగేష్‌యాదవ్ సాయిరాం నారాయణఖేడ్ పట్టణ కార్యదర్శి వెంకట్ రెడ్డి,గౌడ దశరథ్,ఉపాధ్యక్షులు అశోక్, లోకేష్, అశోక్, విష్ణు,ఉపాధ్యాయులు, విద్యాసంస్థల యజమానులు మరియు వేలాది మంది విద్యార్థులు అత్యంత ఉత్సాహంతో పాల్గొని తిరంగా యాత్రను దిగ్విజయం చేశారు.

# ఎస్ఐఆర్ తదుపరి ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

- **బీఎల్ఓ ట్రైనర్లకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ శిక్షణ**

**నాగర్ కర్నూల్, ఆగస్టు 14 (వుదయం బ్యూరో):**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో తదుపరి కార్యాచరణను అత్యంత జాగ్రత్తగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశించారు.జిల్లా సమీకృత అధికారుల కార్యాలయం (ఐడీఓసీ)లో శుక్రవారం మండల స్థాయి ట్రైనర్లకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ అదనపు కలెక్టర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ నెల 17న రాష్ట్రవ్యాప్తంగా ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్న నేపథ్యంలో బూత్ స్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చే 18 మంది మండల స్థాయి ట్రైనర్లకు ఎస్ఐఆర్ తదుపరి దశలపై అవగాహన కల్పించారు. నోటీసుల జారీ, పత్రాల స్వీకరణ, ధ్రువీకరణ, ఆన్‌లైన్ అప్‌లోడ్, కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, వివరాల సవరణ, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.




అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకూడదని, అదే సమయంలో

అనర్హత నమోదులకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు.జిల్లాలో ఇప్పటివరకు 84 శాతం మ్యాపింగ్ పూర్తయిందని తెలిపారు. తల్లిదండ్రుల పేర్లు, వయసు, ఇతర వివరాల్లో లోపాలున్న 1.02 లక్షల మంది ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో సరిచేయాలన్నారు. మ్యాపింగ్ కాని వారు ప్రభుత్వం సూచించిన 12 రకాల ధ్రువీకరణ పత్రాల్లో ఏదైనా ఒకటి సమర్పించాలని తెలిపారు.కొత్త ఓటర్ల నమోదుకు ఫారం6, తొలగింపునకు ఫారం7, సవరణలకు ఫారం8 వినియోగించాలని వివరించారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండే యువత ఫారం 6ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన ట్రైనర్లు మండలాల్లో బీఎల్ఓలకు బీఎల్ఓ యాప్‌పై ప్రాయోగిక శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల, రెవెన్యూ అధికారులు, ట్రైనర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# హర్ ఘర్ తిరంగా ర్యాలీ దేశభక్తిని చాటిన విద్యార్థులు

**అయిజ ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి)**

దేశభక్తి, జాతీయ జెండాపై గౌరవం పెంపొందించేందుకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా న్యూగీతాంజలి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఐజ మున్సిపాలిటీలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ కె. వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ కొత్త బస్టాండ్ నుంచి ప్రారంభమై పాత బస్టాప్, అంబేద్కర్ చౌక్ మీదుగా సాగింది.

విద్యార్థులు చేతుల్లో త్రివర్ణ పతాకాలు పట్టుకుని "భారత్ మాతాకీ జై", "వందే మాతరం" అంటూ దేశభక్తి నినాదాలు చేశారు. జాతీయ జెండాను గౌరవించాలని, దేశాన్ని ప్రేమించాలని ప్రజలకు సందేశం ఇచ్చారు.

"హర్ ఘర్ తిరంగా అంటే ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి. మన జెండా మన దేశానికి గర్వకారణం" అని విద్యార్థులు తెలియజేశారు. భారతదేశానికి స్వాతంత్ర్యం రావడానికి ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు.

దేశం పట్ల ప్రేమ, అందరితో కలిసి ఉండటం, మన జాతీయ జెండాను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. ఈ ర్యాలీలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# 24 గంటల్లో ఇచ్చిన మాట అమలు



- **విద్యార్థులకు షూస్ అందించిన బి.ఆర్.ఎస్ నాయకుడు తోట కమలాకర్ రెడ్డి**
- **తన వంతుగా పాఠశాలకు సహకరిస్తానని వెల్లడి**
- **విద్యార్థులకు స్వయంగా షూ తొడిగిన తోట కమలాకర్ రెడ్డి**
- **మాట ఇచ్చిన వెంటనే స్పందించిన నాయకుడికి ఘన సన్మానం**

**మిరుదొడ్డి, ఆగస్టు 14, వుదయం:**

మానవత్వంతో స్పందించి ఇచ్చిన మాటకు కట్టుబడి విద్యార్థులకు 24 గంటల్లోనే షూస్ ను బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి అందజేశారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించిన సందర్భంగా విద్యార్థులు తమకు షూస్ కావాలని తోట కమలాకర్ రెడ్డికి విన్నవించిన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన ఆయన 24 గంటల్లోపే విద్యార్థులకు శుక్రవారం షూస్ ను స్థానిక సర్పంచ్ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనాథ్ ఆధ్వర్యంలో అందజేసి విద్యార్థుల కోరికను నెరవేర్చారు. కొంతమంది విద్యార్థులు షూస్ వేసుకోరాదని తెలపడంతో స్వయంగా తానే షూస్ వేసి విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా కమలాకర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాలు అందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. రేపటి సమాజ నిర్మాణానికి నేటి బాలలను తయారు చేయాలని సూచించారు. పాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే శక్తివంచన లేకుండా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు అడిగిన వెంటనే షూస్ అందించిన తోట కమలాకర్ రెడ్డికి స్థానిక సర్పంచ్ శ్రీనివాస్ తో పాటు ఉపాధ్యాయులు, గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాలరాజు, పంచాయతీ కార్యదర్శి రాజేష్, గ్రామ యువకులు యాదగిరి, పరుశరాములు, బాల్ రెడ్డి, కృష్ణ, నర్సింలు, స్వామి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మిరుదొడ్డిలో "హర్ ఘర్ తీరంగా" ర్యాలీ



- **100 మీటర్ల జాతీయ జెండాతో విద్యార్థుల జోష్**

**మిరుదొడ్డి, ఆగస్టు 14, వుదయం:**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం మిరుదొడ్డిలో "హర్ ఘర్ తీరంగా" ర్యాలీ అంగరంగ వైభవంగా నిర్వహించారు.ర్యాలీలో విద్యార్థులు 100 మీటర్ల భారీ జాతీయ జెండాను ఊరేగించి అందరి దృష్టిని ఆకర్షించారు. "భారత్ మాతా కీ జై" నినాదాలతో ప్రధాన రహదారుల గుండా సాగిన ర్యాలీలో విద్యార్థులు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు తోట కమలాకర్ రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకుని, వారి స్ఫూర్తిని విద్యార్థులకు తెలియజేశారు. దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, రేపటి పౌరులుగా ఎదుగుతున్న విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు, ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదివి రాణించాలని కమలాకర్ రెడ్డి సూచించారు. దేశ అభ్యున్నతికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# ఇన్సూరెన్స్ అవగాహన కార్యక్రమం



**కోహీర్ ఆగస్టు 14 (వుదయం ప్రతినిధి )**

కోహీర్ మండలం పిచ్చరాగాడి గ్రామంలో శుక్రవారం నాడు బ్యాంకింగ్ సేవలు, పొదుపు, డిజిటల్ బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ధన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఖాతాల వినియోగం, డిజిటల్ బ్యాంకింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ మోసాల పట్ల అప్రమత్తత, అలాగే PMSBY, PMJJBY వంటి బీమా పథకాల ప్రయోజనాల గురించి వివరించారు.ప్రజలు బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, బీమా పథకాల ద్వారా తమ కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమాన్ని ధన్ ఫౌండేషన్ సదాశివపేట CFL కోఆర్డినేటర్ సంపూర్ణ మేడమ్ మరియు అసోసియేట్ స్వప్న నిర్వహించి, ప్రజలకు బ్యాంకింగ్ మరియు ఇన్సూరెన్స్‌పై అవగాహన కల్పించారు.